విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily


సంపుటి : 3 | సంచిక : 260 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 9 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




# అన్ని రాష్ట్రాలూ మెరుగైన పనితీరు చూపాల్సిందే

- కేంద్రానికి మేం సహకరిస్తున్నాం.. కేంద్రం మాకు సహకరిస్తోంది..
- అందుకే 'డబుల్ ఇంజిన్' సర్కారు అంటున్నాం
- 'పీటీఐ వీడియోస్' ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి: దేశంలో పనితీరు బాగోలేని రాష్ట్రాలు కేంద్రం పంపిణీ చేసే పన్నుల వాటాలో అనివార్యంగా అధిక మొత్తం పొందుతున్నాయని, ఫలితంగా మెరుగైన పనితీరు కనబరుస్తున్న ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు నష్టపోతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన 'పీటీఐ వీడియోస్'కు ఇంటర్వ్యూ ఇచ్చారు. వెనకబడిన రాష్ట్రాలు క్రమక్రమంగా తమనుతాము చక్కదిద్దుకోవడం శు భపరిణామమన్నారు. "కేంద్రం ఉద్దేశపూర్వకంగా ఎలాంటి అన్యాయం చేయాలని భావించదు. వెనకబాటుతనానికి జనాభా వంటి కొన్ని పరామితులు ఉన్నాయి. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు ముందున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం, వృద్ధిరేటులో మెరుగైన పనితీరు కనబరుస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. అందుకే ఆదాయపంపిణీలో సమస్య ఏర్పడుతోంది. జనాభా పేదరికం ఆదాయ పంపిణీకి ప్రాధాన్యంగా ఉంది" అని చెప్పారు. "ఈ కారణాల వల్ల

2లో..



## రూ.45,28,822 కోట్ల దిగుమతులిక సులభం

### పీయూష్ గోయల్ వెల్లడి

దిల్లీ: కొత్త వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికా నుంచి వచ్చే ఐదేళ్లలో రూ.45,28,822 కోట్ల దిగుమతులు చేసుకోవడం సులభమవుతుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ పరిమాణం సరిపోదని, రూ.271.73 లక్షల

- మిగతా 2లో...



## రాబోయే కాలమంతా టూరిజానిదే

: రాబోయే కాలమంతా టూరిజానిదేనని.. ఈ విషయంలో ముఖ్యమంత్రి సూచించిన ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం కొండవీడు ఉత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "కూటమి అధికారంలోకి వచ్చాక ఒకవైపు అభివృద్ధి, సంక్షేమం దూసుకెళుతుంటే.. మరోవైపు కళా సాంస్కృతిక వైభవం కొనసాగుతోంది. అన్ని పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి సందర్శకులను ఆకర్షించేలా రాష్ట్రం అంతటా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసినా, నిధులు లేకపోయినా చంద్రబాబు దార్శనికతతో అభివృద్ధి, పర్యాటక పనులు చేస్తున్నాం. ఎక్కడ ఉత్సవాలు
నిర్వహించినా ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. వారసత్వ సంపదగా ఉన్న కొండవీడు కోటను పరిరక్షించుకుందాం. ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం" అని అన్నారు.



## కమ్యూనిస్టుల భావజాలమే విధ్వంసకరం

### దాన్ని దేశం త్వరగా వదిలించుకోవాలి: అమిత్‌షా

భద్రతను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు రూపొందించడం, మౌలికవసతుల కల్పన, మావోయిస్టుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడం తదితర చర్యలతో వామపక్ష తీవ్రవాదం నడ్డి విరిచామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ముందుగా

- మిగతా 2లో...

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం... ముగ్గురు ఏపీ వాసుల దుర్మరణం

- కర్ణాటకలోని కోలారు జిల్లా శ్రీనివాసపురం క్రాస్ రోడ్డు వద్ద ఘటన
- చింతకాయలు కోయడానికి కర్ణాటక వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా ప్రమాదానికి గురైన వైనం
- మృతులు అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం పూలకుంటవారిపల్లెకు చెందిన వారుగా గుర్తింపు

2లో..




## నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం



- స్వర్ణాంధ్ర 2047 విజన్, 10 సూత్రాల అమలుపై ప్రధానంగా సమీక్ష
- ఆదాయార్జన శాఖలు, కేంద్ర పథకాల పురోగతిపై చర్చ
- వర్చువల్ విధానంలో పాల్గొననున్న జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు
- 2026-27 ఆర్థిక సంవత్సర లక్ష్యాలపై సీఎం దిశానిర్దేశం

రాష్ట్ర పాలన, అభివృద్ధి లక్ష్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ సుదీర్ఘ సమీక్ష జరగనుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకానుండగా, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ విధానంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా నిర్దేశించుకున్న లక్ష్యాలు, పాలనలో పారదర్శకత, సామర్థ్యం పెంచేందుకు రూపొందించిన పది సూత్రాల అమలు పురోగతిపై చర్చించనున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటును పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.
ఆదాయాన్ని ఆర్జించే శాఖల పనితీరు, కేంద్ర

- మిగతా 2లో...



## చెన్నైలో పెళ్లి వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్

- చెన్నైలో జరిగిన వివాహ వేడుకలో సందడి
- పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకున్న జగన్, విజయ్
- విజయ్ రాజకీయ ప్రవేశం నేపథ్యంలో పెరిగిన ఆసక్తి
- 'జన నాయకుడితో జన నాయగన్' అంటూ వైరల్ అవుతున్న ఫొటోలు



- మిగతా 2లో...

## కల్తీ నెయ్యి విషయంలో మాజీ సీఎంను బాధ్యుడిని చేయాలి

### తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కల్తీ నెయ్యితో తిరుమల లడ్డూలు తయారు చేసి.. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా చేసిన వారందరిపై చర్యలు ఉండేలా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బాధ్యుడిని చేయాలన్నారు. ఆయనకు హిందువుల మనోభావాలపై నమ్మకం లేదని, డబ్బుకు కక్కుర్తి పడి ఇంత దారుణానికి ఒడిగట్టారన్నారు. ఆదివారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా పాలనలో హిందువుల మనోభావాలు దెబ్బతినేలా దేవాలయాలపై దాడులకు పాల్పడ్డారు. విగ్రహాల తలలు నరికారు. రథాలను తగలబెట్టారు. ఇప్పుడు తిరుమల లడ్డూకు ఉపయోగించిన నెయ్యిని కల్తీ చేశారు. కల్తీ జరిగిందని మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెబుతుండగా, మాజీ సీఎం జగన్ మాత్రం కల్తీ జరగలేదంటున్నారు. వారి మాటలు హిందువులను బాధించాయి. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని బయటపడితే ప్రజలు ఎలా స్పందిస్తారో అనేది మేము

- మిగతా 2లో...



## ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాల్లేవు

- రాజీ పడకుండా పోరాడతాం
- వ్యూహాత్మక రంగాల్లో మలేసియాతో బంధాలు
- ఇండో-పసిఫిక్‌లో శాంతి-సుస్థిరతకు కట్టుబడి ఉన్నాం: మోదీ
- 11 ఒప్పందాలపై సంతకాలు

కౌలాలంపూర్: ఉగ్రవాదంపై తమ సందేశం విస్పష్టమని, దానిలో ద్వంద్వ ప్రమాణాలకు/ రాజీకి తావే లేదని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. మలేసియా పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పుత్రజయ నగరం వేదికగా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సెమీ కండక్టర్లు సహా కీలక రంగాల్లో సహకారానికి సంబంధించి 11 ఒప్పందాలపై వారి సమక్షంలో సంతకాలు జరిగాయి. ఉగ్రవాదంపై పోరులో భారత వైఖరిని మోదీ మరోసారి తేల్చిచెప్పారు. దీనికోసం భారత్, మలేసియాలు నిఘా వర్గాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయని వెల్లడించారు. ఇరుదేశాల పరిధిలోని సముద్ర మార్గాల భద్రతకూ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. "ఇండో-పసిఫిక్ ప్రాంతం

- మిగతా 2లో...

# అన్ని రాష్ట్రాలూ మెరుగైన పనితీరు చూపాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

సాధారణంగా అసంతృప్తి ఉంటుంది. మన విధానాలు పనితీరు కనబరచని రాష్ట్రాలకు అనుకూలంగా ఎల్లప్పుడూ ఉండకూడదు. కొన్ని సందర్భాల్లో రక్షణలు కల్పించడం సరైనదే. అయితే ఎప్పటికైనా అన్ని రాష్ట్రాలూ మెరుగైన పనితీరు చూపాల్సిందే. ఆ బాధ్యత ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలదే. వాళ్లు మెరుగైన పనితీరు చూపించాల్సిందే" అని స్పష్టంచేశారు.

**ఇప్పుడు జనాభా నిర్వహణే..**

జనాభాపై తన దృక్పథం ఇప్పుడు.. 'జనాభా నియంత్రణ' నుంచి 'జనాభా నిర్వహణ'కు మారినట్లు చంద్రబాబు తెలిపారు. "ఐరోపా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఏం జరిగిందో చూడండి. మన ప్రజలు ఎక్కువమంది పిల్లలను కనాలని మొదటిగా నేనే చెప్పాను. ఆ తర్వాత ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు" అని వెల్లడించారు. త్వరలో కేంద్రంలో ఏదైనా కీలక పాత్ర పోషించే అవకాశముందా అని ప్రశ్నించగా.. అలాంటిదేదీ లేదని తెదేపా అధినేత స్పష్టంచేశారు. "ఏనాడు నేను కేంద్రంలో ఏ పదవినీ ఆశించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడానికే ఎప్పుడూ ఆసక్తి చూపుతాను. అది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనైనా.. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోనైనా" అని తెలిపారు. కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు మద్దతుపై మాట్లాడుతూ.. "అది 'పరస్పరం'.. మేం కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాం. వాళ్లు కూడా రాష్ట్రాభివృద్ధికి అండగా నిలుస్తున్నారు. అందువల్లే మేం డబుల్ ఇంజిన్ సర్కారు అని పిలుస్తున్నాం" అని వెల్లడించారు.

**నేను రాజకీయ నాయకుడినే..**

మిమ్మల్ని మీరు టెక్నాలజీ లీడర్‌గా చూసుకుంటారా? లేక రాజకీయ నాయకుడిగానా? అని ప్రశ్నించగా.. రాజకీయ నాయకుడిగానేనని చంద్రబాబు బదులిచ్చారు. "నేను ప్రజల కోసమే పనిచేస్తున్నాను. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికీ, సంపద సృష్టికీ నేను టెక్నాలజీని వినియోగిస్తున్నాను" అని చంద్రబాబు అన్నారు.

**బ్యాంకులో నిల్వల మాదిరిగానే నీటి ఆదా**

సముద్రంలోకి వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటిని నదుల అనుసంధానంతో ఆదా చేసుకోవచ్చని చంద్రబాబు చెప్పారు. మనకు బ్యాంకుఖాతాలో సొమ్ము నిల్వ ఉన్నట్లుగానే.. రిజర్వాయర్‌లో నీటినిల్వ కోసం తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. "గంగా-కావేరీ నదుల అనుసంధానం తొలినాళ్ల నుంచి నా కల. తొలుత దీనిని కొందరు వ్యతిరేకించొచ్చు. అయితే ఎవరు అనుకూలంగా ఉన్నారో వారితో మీరు పనిచేయాలి. చిట్టచివరకు నదుల అనుసంధానమనేది సాధ్యమే" అని వ్యాఖ్యానించారు.

# నేడు సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం

-మొదటిపేజీ తరువాయి

ప్రాయోజిత పథకాల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా ఈ సమావేశంలో సమీక్ష జరగనుంది. రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సీఎం విశ్లేషించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్, డేటా లేక్ వంటి వ్యవస్థల వినియోగం, పాలనలో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్, ఇతర ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై సీఎం దిశానిర్దేశం చేయనున్నారు.

వీటితో పాటు రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం, 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచడం, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా సమీక్షించనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలు సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రులు, కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# కర్ణాటకలో రోడ్డు ప్రమాదం... ముగ్గురు ఏపీ వాసుల దుర్మరణం

కర్ణాటకలోని కోలారు జిల్లా శ్రీనివాసపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీనివాసపురం క్రాస్ వద్ద మలుపు వద్ద ఆదివారం రాత్రి బొలెరో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కూలీలు మృతి చెందగా, మరో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని శ్రీనివాసపురం, మదనపల్లె, రాయల్పాడు ఆసుపత్రులకు తరలించారు.

ప్రమాదంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం పూలకుంటవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (25), వెంకటమ్మ (65), పాతూరు గ్రామానికి చెందిన మునెప్ప (61) మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మునెప్ప ఘటనాస్థలిలోనే మృతి చెందగా, శ్రీనివాసులు, వెంకటమ్మలను ఆసుపత్రులకు తరలించే క్రమంలో మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయారు.

మృతులు, గాయపడిన వారంతా చింతకాయలు కోయడానికి కర్ణాటకకు వెళ్లిన కూలీలుగా సమాచారం. పనులు ముగించుకుని స్వగ్రామాలకు తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాల్లేవు

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు ప్రపంచ వికాసానికి ఒక ఇంజిన్‌లా మారింది. మేం ఆసియాన్ కూటమి దేశాలు సహా యావత్ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను కోరుకుంటున్నాం. ఇంధన, మౌలిక సదుపాయాలు, తయారీ రంగాల్లో ఇరుదేశాల సహకారం బలోపేతమైంది. డిజిటల్ ఎకానమీ, బయోటెక్, ఐటీ విభాగాల్లో ఇరుదేశాల మధ్య పరస్పర పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. మలేసియా- భారత్ ప్రజల మధ్య సంబంధాలు సైతం మరింత మెరుగయ్యాయి. ఫలితంగా ఇరుదేశాల్లో పర్యాటక రంగానికి ఊతం లభించింది. ఈ విజయాల స్ఫూర్తితో మలేసియా, భారత్ భాగస్వామ్యాన్ని మునుపెన్నడూ లేనంత వేగంతో బలోపేతం చేయాలని ఇరువురం నిర్ణయించాం. ఇకపై రక్షణ రంగం, సెమీకండక్టర్ల తయారీ విభాగాల్లోనూ సహకారాన్ని పెంచుకోనున్నాం" అని చెప్పారు. మలేసియాలోని నలుగురు ప్రముఖ వ్యాపారవేత్తలతో మోదీ సమావేశమై.. భారత వృద్ధి గాథలో పాలుపంచుకోవాలన్న వారి ఆసక్తిని అభినందించారు. మలేసియాలోని భారత సంతతి మంత్రులు, ఎంపీలు, సెనేటర్లతోనూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమిళుల గురించి మరోసారి ప్రశంసలు కురిపించారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేసిన జెయరాజ్ రాజారావుతో భేటీ అయ్యారు.

**పెర్దన పుత్రలో ఘన స్వాగతం**

మోదీ ఆదివారం ఉదయం కౌలాలంపూర్ నుంచి పుత్రజయ నగరానికి చేరుకున్నారు. మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం అధికారిక నివాసం పెర్దన పుత్రలో అధికారిక లాంఛనాలతో ఆయనకు స్వాగతం లభించింది. అనంతరం ఇరుదేశాల ఉన్నతాధికారుల బృందాలు, ప్రధానుల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. దేశీయ కరెన్సీల్లో చెల్లింపుల్ని ప్రోత్సహించే ప్రయత్నాలను ఇరుదేశాలూ కొనియాడాయి. భారత్‌తో వాణిజ్యానికి మరిన్ని అవకాశాలు లభిస్తే తమకెంతో ప్రయోజనమని ఇబ్రహీం అన్నారు. మలేసియా పర్యటన ముగించుకుని మోదీ భారత్‌కు బయల్దేరారు.

# టౌన్లలో ఇందిరమ్మ టవర్లు.. జీ ప్లస్ 3, 5 పద్ధతిలో నిర్మాణం

హైదరాబాద్ , : రూరల్ ప్రాంతాల్లో శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సాగుతున్న నేపథ్యంలో ఇపుడు అర్బన్ ఏరియాల్లో ఇళ్ల నిర్మాణంపై హౌసింగ్ శాఖ ఫోకస్ పెట్టింది. రూరల్లో నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున మూడున్నర లక్షల ఇళ్లు మంజూరు చేయగా ఇందులో రెండున్నర లక్షల ఇళ్లు స్టార్ట్ అయ్యాయి. ఇందులో భాగంగా జీహెచ్ ఎంసీ తో పాటు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జీ ప్లస్ 3 లేదా 5 ఫ్లోర్లలో ఇందిరమ్మ టవర్లను ప్రభుత్వం నిర్మించనుంది. వీటిని వచ్చే ఆర్థిక సంవత్సరం అంటే ఏప్రిల్ నుంచి పనులు స్టార్ట్ చేయనున్నారు. వీటితో పాటు పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకు

ఎంఐజీ, ఎల్ ఐజీ కాలనీలు నిర్మించటం, శాటిలైట్ టౌన్ షిప్ లు నిర్మాణాలు చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. ఈ మూడు నిర్మాణాలకు వచ్చే బడ్జెట్ లో నిధులు కేటాయించాలని ఫైనాన్స్ కు హౌసింగ్ అధికారులు ప్రపోజల్స్ పంపించారు. త్వరలో హౌసింగ్ మంత్రి దగ్గర రివ్యూ చేపట్టి, తరువాత డిప్యూటీ సీఎం శాఖల వారీగా రివ్యూలు చేయనున్నారు.

**వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పనులు స్టార్ట్**

అర్బన్ ఏరియాల్లో స్టార్ట్ చేయనున్న ఇందిరమ్మ టవర్లను ముందుగా జీహెచ్ ఎంసీలో స్టార్ట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏప్రిల్ నుంచి జీహెచ్ ఎంసీలో పనులు స్టార్ట్ చేయనున్నట్లు అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. అర్బన్ ఏరియాల్లో అర్హులు ఎక్కువ ఉండి సొంత జాగా లేని వాళ్లకు ఇళ్ల నిర్మాణంకు స్లమ్ ఏరియాలు, ప్రభుత్వ స్థలాలు గుర్తించి వివరాలు అందచేయాలని జిల్లా కలెక్టర్లను హౌసింగ్ శాఖ ఆదేశించింది. వీటి వివరాలు హౌసింగ్ శాఖకు చేరాయి. నగర ప్రాంతాల్లో సొంత స్థలం లేని వేలాది మందికి ఈ విధానం ద్వారా లబ్ధి చేకూరనుంది. ఒకే చోట వందలాది కుటుంబాలు నివసించేలా గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఈ ప్రాజెక్టులు ఉండబోతున్నాయి. ముఖ్యంగా మురికివాడల్లో నివసించే వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ఈ టవర్ల నిర్మాణ ప్రధాన ఉద్దేశ్యం. కొన్ని జిల్లాల్లో రెవెన్యూ పురపాలక శాఖ అధికారులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో అనువైన భూములను సర్వే చేస్తున్నారు. ముందుగా జీహెచ్ ఎంసీలో 19 చోట్ల స్లమ్ ఏరియాలను గుర్తించింది.

ఇక్కడ జీ ప్లస్ 3 లేదా 5 ఫ్లోర్లలో ఇందిరమ్మ టవర్లను నిర్మించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్లలో పార్కింగ్ కు స్థలం వదిలేసి ఒక్కో ఫ్లోర్ లో 2 ఇళ్ల చొప్పున మూడు టవర్లలో 12 ఇళ్ల చొప్పున నిర్మించనున్నారు. ఇంటి నిర్మాణం, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించనున్నారు. మౌళిక వసతులు మొత్తం కలిపి ఒక్కో ఇంటికి రూ. 8 లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో పాటు, అవసరమైన చోట అదనపు నిధులను వెచ్చించి ఈ టవర్లను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు ఖర్చు చేస్తోంది. ఇందులో రూరల్ లో రూ. 72 వేలు , అర్బన్ లో రూ. 1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. అయితే ప్రభుత్వం ఇచ్చే వ్యయంకు మరో రూ. 3 లక్షలు అదనంగా ఖర్చు కానుంది. వీటిని మెప్మా తో పలు మార్గాల నుంచి సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల ను ప్రభుత్వం మంజూరు చేసింది. అర్బన్ ఏరియాల్లో కూడా ఇలాగే మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ ప్రకటన**

రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి పేదవాళ్లకు ఇళ్లు నిర్మించి తక్కువ ధరలకు అందించాలని అఫర్టబుల్ హౌసింగ్ పాలసీని ప్రభుత్వం తీసుకరానుంది. వచ్చే నెల ప్రవేశపెట్టనున్న బడ్జెట్ లో అఫర్టబుల్ హౌసింగ్ పాలసీని ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే డ్రాఫ్ట్ పాలసీ రెడీ అయింది. త్వరలో ఈ పాలసీపై బిల్డర్లతో హౌసింగ్ అధికారులు, ఈ పాలసీ ఖరారుకు ప్రభుత్వం నియమించిన కన్సల్టెన్సీ మీటింగ్ నిర్వహించి సలహాలు సూచనలు తీసుకోనుంది.

# కల్తీ నెయ్యి విషయంలో మాజీ సీఎంను బాధ్యుడిని చేయాలి

-మొదటిపేజీ తరువాయి

ఆలోచించాం. అయినా వాస్తవాలు బయటపెట్టాలి. వీటన్నింటిపై త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తాం' అని పల్లా చెప్పారు.

# కమ్యూనిస్టుల భావజాలమే విధ్వంసకరం

- మొదటి పేజి తరువాయి

అనుకున్న మేరకు మార్చి 31 నాటికి ఈ ముప్పు పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టుల భావజాలం దేశానికి విధ్వంసకరమని షా వ్యాఖ్యానించారు. ఈ భావజాలాన్ని భారత్ త్వరగా వదిలించుకోవాలని అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయ్‌పుర్‌లో ఆదివారం వామపక్ష తీవ్రవాదంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

# చెన్నైలో పెళ్లి వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్

రాజకీయ, సినీ రంగాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఒకే వేడుకలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్, నటుడు-రాజకీయ నేత 'దళపతి' విజయ్ ఆదివారం చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్.. ఇద్దరు అగ్రనేతలతో కలిసి కనిపించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.వైసీపీ అధినేత జగన్ బంధువు వై.ఎస్. సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ రెడ్డి వివాహం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన స్టాలిన్, జగన్, విజయ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. జగన్, విజయ్ పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించుకోవడం కెమెరాల కంటపడింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవలే 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పేరుతో విజయ్ రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు, 'జన నాయగన్' అనే తన సినిమా సెన్సార్ వివాదాలతో వార్తల్లో నిలిచారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో జగన్, స్టాలిన్ వంటి ప్రముఖ నేతలతో విజయ్ కనిపించడం తమిళ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఈ వివాహ వేడుకకు నటులు సూర్య, కార్తి కూడా హాజరయ్యారు.

# రూ.45,28,822 కోట్ల దిగుమతులిక సులభం

- మొదటి పేజి తరువాయి

కోట్ల భారత ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద సంఖ్య కాదని అభిప్రాయపడ్డారు. కేవలం ఏవియేషన్ రంగంలోనే రూ. 9.06 లక్షల కోట్లకుపైగా దిగుమతులు అవసరమని, దానికి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ, ముడి చమురు అదనమని తెలిపారు. అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పంద ఫ్రేమ్‌వర్క్ ఖరారైన నేపథ్యంలో ఆదివారం ఆయన పీటీఐ వీడియోస్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. '18శాతం సుంకాలను ఎదుర్కొంటున్న భారతీయ ఉత్పత్తులు.. ఇతర దేశాలతో పోలిస్తే అమెరికా మార్కెట్లలో బాగానే లబ్ధి పొందుతాయి. మనతో పోటీపడే చైనాపై 35శాతం, ఇతర ఆసియా దేశాలపై 19శాతం సుంకాలున్నాయి. మనం ప్రపంచంలోని అన్ని దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటున్నాం. వచ్చే ఐదేళ్లలో ఇవి రూ. 181.15 లక్షల కోట్లకు చేరనున్నాయి. అందుకే భారత్‌లో డిమాండు ఉందని అమెరికా ప్రతినిధులకుచెప్పా. సుంకాలను తగ్గించడం ద్వారా పోటీపడాలని సూచించా' అని గోయల్ తెలిపారు.

**సెమీ కండక్టర్ చిప్‌లకు గిరాకీ**

'దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదుగుతోంది. అందువల్ల పలు ప్రత్యేక రంగాల్లో దిగుమతుల డిమాండు పెరుగుతోంది. సెమీ కండక్టర్ చిప్‌లు, హైఎండ్ యంత్రాలు, డేటా సెంటర్ల పరికరాలు, విమానాలు, విమాన విడి భాగాలు, ఇంధన పరికరాలకు డిమాండు ఉంటుంది. 10 గిగావాట్ల డేటా సెంటర్లను దేశంలో చూడవచ్చు. వాటికి అవసరమైన పరికరాలను దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. వాటిని అమెరికా సరఫరా చేయగలదు' అని వివరించారు. 'మనకు విమానాలు అవసరం. విమాన ఇంజిన్లు అవసరం. విడి భాగాలూ కావాలి. ఇప్పటికే ఈ రంగంలో రూ. 4.53 లక్షల కోట్ల ఆర్డర్లను బోయింగ్‌కు ఇచ్చాం. అవి మరింత పెరగనున్నాయి' అని తెలిపారు. మనతో పోటీపడే దేశాలతో పోలిస్తే మనపైనే ప్రతీకార సుంకాలు తక్కువగా ఉన్నాయని వివరించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో మన రైతులకు, మత్స్యకారులకు ప్రయోజనం కలగనుందని గోయల్ తెలిపారు.

**ప్రతి ఒక్కరితో చర్చించా**

'నేను అమెరికా ప్రతినిధుల్లో ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిశా. వారితో బలమైన బంధాన్ని ఏర్పరుచుకున్నాం. ఇప్పుడంతా ఒక కుటుంబంలా కలిసిపోయాం' అని గోయల్ తెలిపారు.

# భారత్ - మలేషియా ప్రధానులు కీలక రంగాల పై ఒప్పందాలు.



**మలేషియా : పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మలేషియాలో రెండు రోజు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా రొండో రోజు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మలేషియా ప్రధాని ఇబ్రహీంతో వాణిజ్యం, పెట్టు బడులు, రక్షణ అంశాల పై ఇద్దరి మధ్య చర్చలు జరిగాయి. పలు కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగించారు. భారత్-మలేషియా మధ్య సంబంధాలు ప్రత్యేక మైనవని వ్యాఖ్యానించారు. టూరిజంలో పరస్పర సహకారం..డిజిటల్, బయోటెక్, ఐటీలో పరస్పర పెట్టుబడులు పెరిగాయని వివరించారు. టూరిజంలో పరస్పర సహకారం కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీల్లో పరస్పర సహకారం పై ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. సెమీకండక్టర్లు, ఆరోగ్యం, ఆహార భద్రత రంగాల్లో ఒప్పందాలు జరిగాయని వివరించారు. ఉగ్రవాద నిర్మూలనకు రెండు దేశాలు కలిసి సంయుక్తంగా పనిచేస్తాయని ప్రకటించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధి, శాంతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ప్రపంచ వృద్ధి, వాణిజ్యానికి ఇండో-పసిఫిక్ ప్రాంతం కీలకమని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదం పై రాజీ పడే ప్రసక్తే లేదు..ఈ వేదికగా ఉగ్రవాదం మీద పోరు పై భారత్ వైఖరిని మరోసారి ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం మీద పోరు పై భారతదేశ సందేశం స్పష్టంగా ఉందని తెలిపారు. ద్వంద్వ ప్రమాణాలు లేవని, రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పుకొచ్చారు. శాంతి కోసం చేసే అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టడం, నిఘా భాగస్వామ్యం, సముద్ర భద్రతలో భారత్ - మలేషియా మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# పాడి గేదెల పేరుతో భారీ మోసం..




పశువులను ఇంటికే పంపిస్తామంటూ మోసం చేసిన కేటుగాళ్లు.

**కామారెడ్డి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** కామారెడ్డి జిల్లాలో పాడి గేదెల పేరుతో భారీ సైబర్ మోసం జరిగింది. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన చాకలి రమేశ్ అనే రైతు నుంచి సైబర్ కేటుగాళ్లు రూ. 8.84 లక్షలు కాజేశారు..యూట్యూబ్ రీల్స్ ద్వారా మోసం..రైతు రమేశ్ యూట్యూబ్‌లో రీల్స్ చూస్తున్న సమయంలో, తక్కువ ధరకు పాడి గేదెలను హోమ్ డెలివరీ చేస్తామంటూ ఓ పోస్ట్ కనిపించింది. ఆ పోస్ట్‌లో ఉన్న సెల్ నెంబర్ కు కాల్ చేయగా, అవతలి వ్యక్తులు నమ్మకంగా మాట్లాడి డీల్ ఖరారు చేసినట్లు సమాచారం. పాడి గేదెలను హోమ్ డెలివరీ చేయడం కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు పంపాలని సదరు రైతుకు ఓ లింక్ ను పంపించారు. వారి మాటలు నమ్మిన రైతు రమేష్ విడతలవారీగా మొత్తం రూ. 8.84 లక్షలు పంపించాడు. డబ్బులు పంపిన తర్వాత కూడా పాడి గేదెలు హోమ్ డెలివరీ కాకపోవడంతో రైతు రమేష్ అవతలి వ్యక్తికి ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని రావడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన పై దోమకొండ పోలీస్ స్టేషన్ లో రైతు రమేష్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, సైబర్ మోసం కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ప్రజలకు సూచనలు జారీ చేశారు. సోషల్ మీడియా, యూట్యూబ్ పోస్టులను నమ్మి డబ్బులు పంపొద్దని సూచించారు. తక్కువ ధర, హోమ్ డెలివరీ అంటూ వచ్చే ప్రకటనల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకుండా ఉండాలని పోలీసులు సూచించారు.

# పదవి నుంచి తప్పు కోవాలని ఎప్పుడు కోరినా రెడీ గా ఉన్నాను భాగవత్




**ముంబై, పెన్ సత్తా, ఫిబ్రవరి 08: :** తన పదవీ విరమణ పై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా పదవిలో కొనసాగాలని సంఘ్ తనను కోరిందని తెలిపారు. ఒకవేళ పదవి నుంచి దిగిపోవాలని ఆదేశిస్తే, తప్పుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ముంబైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మోహన్ భాగవత్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ చరిత్రలో ఇంత వరకు ఎవరినీ పదవీ విరమణ చేయించాల్సిన పరిస్థితి రాలేదు. ఆర్ఎస్ఎస్ చీఫ్ పదవికి ఎన్నికలు ఉండవు. ప్రాంతీయ, డివిజనల్ అధ్యక్షులు సర్‌సంఘ్‌చాలక్‌ను నియమిస్తారు. ఆర్ఎస్ఎస్ విధానాల ప్రకారం, 75 ఏళ్లు నిండిన తర్వాత ఎలాంటి పదవిలో లేకుండా పని చేయాలంటారు. నాకు 75 ఏళ్లు నిండాయి. ఈ విషయాన్ని సంఘ్‌కు కూడా తెలియజేశాను. కానీ నన్ను యథావిధిగా కొనసాగాలని కోరింది. పదవి నుంచి తప్పుకోవాలని ఎప్పుడు కోరినా రెడీగా ఉన్నాను. కానీ, పని నుంచి మాత్రం ఎప్పటికీ రిటైర్మెంట్ ఉండదు అని భాగవత్ స్పష్టం చేశారు. ఇదే కార్యక్రమంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం, వీర్ సావర్కర్ గురించి భాగవత్ ప్రస్తావించారు. వీర్ సావర్కర్ కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుంది. అలానే దేశ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నాను. అన్ని వర్గాలను పరిగణన లోకి తీసుకొని ఉమ్మడి పౌరస్మృతి రూపొందించాలి, అది విభేదాలకు దారితీయకూడదు అని తెలిపారు.

# మార్చి 31 నాటికి విజయవాడ బైపాస్ పనులు పూర్తి



విజయవాడ బైపాస్‌లో అక్కడి వరకు వాహనాలకు పర్మిషన్.



**ఇంటర్నెట్ డెస్క్: పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** విజయవాడ బైపాస్ లో ప్రస్తుతం టోల్ ప్లాజా దాటిన తర్వాత వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి కొనసాగుతోంది. అయితే ఈ నెల 10 వ తేదీ సాయంత్రం నుంచి హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకూ వాహనాలకు అనుమతి ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. హాయ్ ల్యాండ్ రోడ్డు లోకి దిగి కొంత దూరం ప్రయాణిస్తే చెన్నైకోల్కతా సర్వీస్ రోడ్డును చేరుకునే అవకాశం ఉంటుంది. మొదటి దశలో కార్లు, ద్విచక్ర వాహనాలకే ఈ సడలింపు వర్తింపజేయనున్నారు. ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. లారీలకు ఫిబ్రవరి 20 నుంచి అనుమతి, బైపాస్ మార్గాన్ని పది రోజుల పాటు పరిశీలించిన తర్వాత, ఫిబ్రవరి 20 వ తేదీ నుంచి లారీలను కూడా అనుమతించాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భావిస్తోంది. మరో వైపు విజయవాడ బైపాస్ నుంచి చెన్నైకోల్కతా జాతీయ రహదారికి అనుసంధాన పనులు మార్చి నెలలో పూర్తి కానున్నాయి. ఆ తర్వాత గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారి పైకి వెళ్లగలుగుతాయి. దీంతో నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఈ మార్పులు ప్రయాణికులకు పెద్ద ఉపశమనం కలిగించనున్నాయి. మార్చి 31లోపు విజయవాడ బైపాస్ పూర్తి లక్ష్యం. గొల్లపూడి నుంచి చినకాకాని వరకూ 17.6 కిలో మీటర్ల పొడవున ఆరు వరుసలుగా విజయవాడ బైపాస్ నిర్మాణం కొనసాగుతోంది. సుమారు 1194 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నది పై ఆధునిక వంతెనల నిర్మాణం కూడా చేపడుతున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల లోక్‌సభలో మాట్లాడుతూ, మార్చి 31 నాటికి విజయవాడ బైపాస్ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ ప్రాంత రవాణా వ్యవస్థలో కీలక మార్పు రానుంది.

## అంబటి రాంబాబుకు బిగ్ షాక్.. పీటీ వారెంట్ జారీ




**గుంటూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 08**: మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు కేసుకు సంబంధించి పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గతేడాది నవంబర్ 12 న మెడికల్ కాలేజీల పీపీపీ మోడల్ ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన అంబటి పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు తోసుకుని వెళ్లారు. ఈ ఘటన పై అప్పట్లోనే పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. అంబటి రాంబాబు అప్పట్లో పోలీసులు అడ్డుకున్నా బారికేడ్లను తోసుకుని ఆందోళనలో పాల్గొన్నారని, ఈ విషయం పై కేసు దర్యాప్తు జరుగుతోందని పోలీసులు పీటీ వారెంట్ లో ప్రస్తావించారు. పోలీసులు ఈ నెల (ఫిబ్రవరి) 11 వ తేదీ లోపు అంబటి రాంబాబును కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. దీంతో అంబటిని రేపు(సోమవారం) మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. అంబటి రాంబాబుకు సంబంధించిన కస్టడీ పిటిషన్ పై రేపు మొబైల్ కోర్టు తీర్పు ప్రకటించనుంది.

## మంచు విష్ణుకు పోలీసుల నోటీసులు.. ఏ 2 గా నమోదు..




**తిరుపతి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** ప్రముఖ నటుడు మంచు మోహన్ బాబు విశ్వవిద్యాలయానికి సంబంధించి, విద్యార్థి నేతల కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నటుడు, 'మా' అధ్యక్షుడు మంచు విష్ణుకు చంద్రగిరి పోలీసులు ఆదివారం నోటీసులు పంపించారు. కిడ్నాప్ ఆరోపణల నేపథ్యంలో విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా పోలీసులు రెండు నోటీసులు ఇచ్చారు. విద్యార్థి సంఘాల నేతల పై ఇచ్చిన ఫిర్యాదులో ఆధారాలు సమర్పించాలని చంద్రగిరి పోలీసులు నోటీసులు జారీ చేశారు. అలాగే మరో వైపు విద్యార్థి సంఘాల నేతల కిడ్నాప్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ తిరుచానూరు పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసులో మంచు విష్ణును ఏ 2 గా, మంచు మోహన్ బాబును ఏ 3 గా చేర్చారు. కిడ్నాప్ కేసులో పీఆర్వో సతీశ్(ఏ1)తో పాటు పలువురు బౌన్సర్లు ఇప్పటికే అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయం పై ఇప్పటికే ఏపీ హైకోర్టులో మంచు మోహన్ బాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# ఆలయాల ఆగమ విధానాల్లో జోక్యం చేసుకోవద్దు..

అధికారులకు మంత్రి ఆనం కీలక ఆదేశాలు



**నెల్లూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 08: ఫిబ్రవరి 08:** శైవక్షేత్రాల్లో మూలస్థానేశ్వర స్వామి ఆలయం చాలా ప్రతిష్ట కలిగిన దేవాలయమని ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. నూతన పాలక మండలి సమష్టి కృషితో పనిచేయాలని సూచించారు. పదవిని బాధ్యతగా భావించి భక్తులకి సేవలు అందించాలని కోరారు. ఆలయ ప్రతిష్టను మరింత ఇనుమడింప చేయాలని మార్గనిర్దేశం చేశారు. నెల్లూరు జిల్లా లోని మూలపేట భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి హాజరయ్యారు. స్వామిని దర్శించుకొని మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రుల సమక్షంలో చైర్మన్ పుట్టా అజయ్ కుమార్ రెడ్డి, పది మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడారు. ఆలయాల్లో సామాన్య భక్తులకి పెద్దపీట వేయాలన్నది సీఎం చంద్రబాబు నిర్ణయమని చెప్పుకొచ్చారు. ఆలయాల ఆగమ విధానాల్లో దేవదాయ శాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దని ఆదేశించారు. ఆగమ పండితుల సూచనలు, సలహాలతో అధికారులు ముందుకెళ్లాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దిశానిర్దేశం చేశారు. భక్తులకి సేవలు అందించి పాలకమండలి మంచి పేరు తెచ్చుకోవాలని మంత్రి నారాయణ సూచించారు. ఈ నెల 15 వ తేదీ నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకి అవసర మైన అన్ని ఏర్పాట్లు చేయాలని మార్గనిర్దేశం చేశారు. 2018 లో ఈ ఆలయ కోనేరు అభివృద్ధికి రూ. 6.80 కోట్లు కేటాయించామని ప్రస్తావించారు. మంత్రి ఆనం సహకారంతో నెల్లూరు సిటీ లోని అన్ని ఆలయాల అభివృద్ధి జరుగుతుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## రష్యాలో భారతీయ విద్యార్థులకు కత్తిపోట్లు



**రష్యా: పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** రష్యాలో దిగ్భ్రాంతికర ఘటన చోటు చేసుకుంది. భారత్ కు చెందిన నలుగురు విద్యార్థులు కత్తిపోట్లకు గురయ్యారు. ఉఫా సిటీలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ నలుగురు కూడా వైద్య విద్యార్థులే. మెడికల్ కోర్స్ చేయడానికి వేర్వేరు రాష్ట్రాల నుంచి రష్యా వెళ్లారు. బాష్కోర్టోస్టాన్ రిపబ్లిక్ లోని ఓ మెడికల్ యూనివర్సిటీలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ విషయాన్ని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. గాయపడిన వారందరికీ చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించింది. రష్యా కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. 15 ఏళ్ల యువకుడొకడు ఉఫా స్టేట్ మెడికల్ యూనివర్సిటీ ప్రాంగణం లోకి అక్రమంగా చొరబడ్డాడు. నేరుగా హాస్టల్ లోకి వెళ్లి అక్కడ ఉన్న విద్యార్థుల పై ఆకస్మికంగా కత్తితో దాడి చేశాడు, హాస్టల్ ప్రాంగణంలో స్వైరవిహారం చేశాడు. కనిపించిన వారి పై కనిపించినట్టే దాడికి పాల్పడ్డాడు. ఊహించని విధంగా ఈ ఘటన సంభవించడంతో విద్యార్థులు తేరుకోలేకపోయారు. రష్యా హోమ్ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితుడు పలువురు విద్యార్థులను కత్తితో పొడిచాడు. వీరిలో నలుగురు భారతీయ విద్యార్థులు కూడా ఉన్నారు. అతన్ని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నించగా, నిందితుడు ఇద్దరు పోలీసుల పై కూడా దాడి చేశాడు. అరెస్టును ప్రతిఘటించే క్రమంలో దాడి చేసిన యువకుడు కూడా స్వయంగా గాయపడ్డాడు. నిందితుడిని అదుపు లోకి తీసుకునే క్రమంలో పోలీసులు గాయపడ్డారని, దాడి చేసిన వ్యక్తి కూడా గాయాల పాలయ్యాడని హోం శాఖ అధికార ప్రతినిధి మేజర్ జనరల్ ఇరినా వోల్క్ తెలిపారు. ఈ దాడిలో గాయపడిన విద్యార్థులందరినీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. దాడికి పాల్పడిన యువకుడిని కూడా ఆసుపత్రిలో చేర్చగా, అతని పరిస్థితి కూడా తీవ్రంగా ఉంది. అతనికి చికిత్స కొనసాగుతోంది. నిందితుడికి నిషేధిత నియో-నాజీ సంస్థతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైందని స్థానిక మీడియా తెలిపింది. దాడి సమయంలో అతను జాతీయవాద నినాదాలు చేసినట్టు కూడా సమాచారం. దర్యాప్తు ఏజెన్సీలు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ఈ సంఘటన తర్వాత యూనివర్సిటీ, పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచారు. దాడుల అనంతరం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోన్నామని, భారతీయ విద్యార్థుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోన్నామని భారత రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఈ ఘటన పట్ల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది.ం


## ధ్వంసం అయిన స్థావరాలను తిరిగి పునర్నిర్మిస్తున్న పాకిస్థాన్



**పాకిస్తాన్: పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. మే 7 నుంచి 10 వరకు నాలుగు రోజుల పాటు జరిగిన ఈ ఆపరేషన్ లో పాకిస్థాన్ లోని పలు కీలక ఉగ్ర స్థావరాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ధ్వంసం చేసింది. వందల మంది పాకిస్థానీ ఉగ్రవాదులను ఏరిపారేసింది. దాంతో భారత్ సైన్యం శక్తిసామర్థ్యాలు పాకిస్థాన్ కు అర్థం అయ్యాయి. పాకిస్థాన్ తో పాటు ప్రపంచ దేశాలు భారత్ సైన్యం ధైర్య సాహసాలను ప్రత్యక్షంగా చూసింది. అయితే పాకిస్థాన్ మాత్రం ఎంత కొట్టినా చావని పాములా వ్యవహరిస్తోంది. ఆపరేషన్ సింధూర్ లో ధ్వంసం అయిన పలు స్థావరాలను తిరిగి పునర్నిర్మించుకుంటుంది. తాజాగా ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా లోని పహల్గామ్ లోయలో ఏప్రిల్ 22 న ఉగ్రవాదులు జరిపిన మారణ హోమంలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ ఘటన వెనకున్నట్లు తేలింది. అనంతరం పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాల పై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులను ఏరివేసింది. ధ్వంసం అయిన ఉగ్ర స్థావరాలను తిరిగి నిర్మించుకుంటోంది. పాకిస్థాన్ కు చెందిన భోలారీ ఎయిర్ బేస్ ఆపరేషన్ సింధూర్ సమయంలో ధ్వంసం అయింది. అయితే తాజాగా ఈ ఎయిర్ బేస్ వద్ద పనులు శరవేగంగా సాగుతున్నాయి. మే 10, 2025 న పాకిస్థాన్ పై చేపట్టిన ఆపరేషన్ లో ఈ ఎయిర్ బేస్ ను పూర్తిగా ధ్వంసం చేసింది భారత్ సైన్యం. దాదాపు 88 గంటల పాటు సాగిన ఈ ఆపరేషన్ లో భోలారీ ఎయిర్ బేస్ తో పాటు అనేక కీలక స్థావరాలను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ధ్వంసం చేసింది. వాటిలో ముజఫరాబాద్ లోని సవాయ్ నాలా క్యాంప్, ముజఫరాబాద్ లోని సిడ్నా బిలాల్ క్యాంప్, కోట్లీలోని గుల్ పూర్ క్యాంప్, భీంబర్ లోని బర్నాలా క్యాంప్, కోట్లీలోని అబ్బాస్ క్యాంప్, సియాల్ కోట్ లోని సర్జాల్ క్యాంప్, సియాల్ కోట్ లోని మెహమూనా జోయా క్యాంప్, మురిడ్ కే లోని మార్కాజ్ టైబా క్యాంప్, బహావల్ పుర్ లోని మార్కజ్ సుభానల్లా క్యాంప్.. ఉన్నాయి. వీటిని భారత్ పూర్తిగా ధ్వంసం చేసింది. అయితే త్వరలోనే వీటిని కూడా తిరిగి నిర్మించే పనిలో పాకిస్థాన్ నిమగ్నమైనట్లు సమాచారం.

# తెలుగుప్రజలు అరుణాచలానికి ఎక్కువగా ఎందుకు వెళతారు?.







**పెన్ సత్తా డెస్క్ :**ఇప్పుడు తెలుగునాట అరుణాచల క్షేత్ర పర్యటన, మహాత్మ్యం ఇవన్నీ నిరంతరం చర్చలో ఉంటున్నాయి. భక్తి చానెళ్లు, ప్రవచనకారుల ప్రసంగాల్లో, ఆధ్యాత్మిక ఆసక్తి ఉన్న హిందువులు కలిసిన సందర్భంలో, అన్నిటికీ మించి సోషల్ మీడియాలో అరుణాచలం గురించి చర్చ లేకుండా ఉండదంటే అతిశయోక్తి కాదు. ఈ మధ్య అరుణాచల క్షేత్రం తెలుగువారితో నిండిపోయిందని కొన్ని చోట్ల వార్తలు కూడా చూస్తూనే ఉన్నాం. ఈ మధ్యే తెలుగు వారికి అరుణాచలం గురించి తెలిసింది అని ఎక్కువ మంది నమ్ముతారు. కానీ, తెలుగువారికి ఆ క్షేత్రం గురించి తెలిసింది ఈ మధ్య కాదు, చాలా ఏళ్ల క్రితమే వారికి దీనితో పరిచయం ఉంది. హిందువులు విశ్వసించే పంచ భూత లింగాల క్షేత్రల్లో ఒకటిగా భక్తులకు అరుణాచలం (తిరువణ్ణామలై) తెలుసు. వాటిలో ఒకటి శ్రీకాళహస్తి ఆంధ్రలోనే ఉండగా, మిగిలిన నాలుగూ తమిళనాడులో ఉన్నాయి. ఇటీవల ప్రవచనకర్తల ప్రవచనాల కన్నాముందే, తెలుగువారిని అరుణాచలం వైపు ఆకర్షించిన విషయం ఒకటుంది. అదే రమణ మహర్షి, అక్కడకు తెలుగువారు పెరగడంలో రమణ మహర్షి పాత్ర ఎక్కువే, రమణ మహర్షి మీద భక్తితో దశాబ్దాల క్రితమే తమిళనాడు లోని తిరువణ్ణామలైకి వెళ్లి అక్కడే స్థిరపడ్డ తెలుగు కుటుంబాలు కొన్ని ఇప్పటికీ కనిపిస్తాయి. అక్కడి ఆశ్రమాల్లో, వృద్ధాశ్రమాల్లో ఎందరో తెలుగువారు ఉంటారు. వారంతా 60 లు, 70 ల నుంచే అరుణాచలానికి తరచూ వెళ్లేవారు. వారిలో ఎక్కువ మంది అక్కడున్న అరుణాచలేశ్వరుడితో పాటు, ఆ క్షేత్రంలో నివసించిన రమణ మహర్షి, శేషాద్రి స్వామి వంటి సాధువులకు కూడా భక్తులే. వీరంతా ఆయా సాధువులను సాక్షాత్తూ దేవుడిలాగే చూస్తారు. రమణ మహర్షి పై భక్తితో అక్కడకు వెళ్లినవారు ఎక్కువగా కనిపిస్తారు.

తెలుగునాట ప్రముఖ రచయిత గుడిపాటి వెంకటాచలం, గోదావరి జిల్లాల్లో జిన్నూరు నాన్నగారు, ఇలాంటి కొందరు రమణ మహర్షి గురించి తెలుగువారికి బాగా తెలియడానికి కారకులయ్యారు. మరీ చరిత్రలోకి వెళితే, 18 వ శతాబ్దం నాటికే అరుణాచలం దగ్గర తెలుగు శాసనాలు కనిపించాయి. ప్రస్తుత అరుణాచల గోపుర నిర్మాణం ప్రారంభించింది శ్రీకృష్ణ దేవరాయలు అయితే, దాన్ని పూర్తి చేసింది తంజావూరు తెలుగు పాలకుడు సేవప్ప నాయకుడు.

తిరువణ్ణామలైతో పాటు పరిసర గ్రామాల్లో కూడా కొన్ని తెలుగు శాసనాలు కనిపించినట్టు చెప్పారు చరిత్రకారులు బాలమురుగన్. ఈ చరిత్రను పక్కన పెడితే, ఆధ్యాత్మిక భావనలతో తెలుగునేల నుంచి తిరువణ్ణా మలై వెళ్లే వారి సంఖ్య మాత్రం దశాబ్దాల నుంచీ ఎక్కువగానే ఉంది. ఇక్కడ ఉన్నన్ని రోజులూ రోజూ గిరి ప్రదక్షిణ ఉదయం 2 గంటలకు మొదలుపెడితే 5 గంటలకు తిరిగి గుడికి చేరుకుని దర్శనం చేసుకుని, తరువాత రమణాశ్రమానికి వెళ్లేవాళ్లు.

సాయంత్రం పూట అరుణాచలం లోని రమణాశ్రమానికి వెళితే అక్కడ తెలుగులో మాట్లాడుకునే వారు చాలా మంది కనిపిస్తారు. వారంతా దశాబ్దాలుగా ఈ ఊరితో అనుబంధం పెంచుకున్నవారు. అందుకే అక్కడ రమణాశ్రమంలో తెలుగులో కూడా కొన్ని బోర్డులు కనిపిస్తాయి. రమణాశ్రమంతో పాటు, శేషాద్రి స్వామికి కూడా తెలుగు నాట భక్తులు ఉన్నారు. ఆయన ఆశ్రమం కూడా ఆ పక్కనే ఉంటుంది. అయితే స్థూలంగా అలా వచ్చిన వారిలో ముందు నుంచీ ఆధ్యాత్మిక అవగాహన ఎక్కువ ఉన్న కుటుంబాలు ఎక్కువగా కనిపిస్తుంటారు. సాహిత్య పరిచయం ద్వారా వచ్చిన వారు కొందరుంటారు. 1929-2011 మధ్య జీవించిన గుడివాడకు చెందిన మెరుగుమాల రాధా నాగేశ్వర రావు మొదట్లో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసేవారు. యాదవ కులానికి చెందిన ఆయనకు, తన మేనమామ ద్వారా రమణ మహర్షిగా తెలిసింది. అయితే రమణ మహర్షి జీవించి ఉండగా ఆయన్ను చూడని ఎంఆర్ నాగేశ్వర రావు, కాలక్రమంలో రమణ మహర్షి భక్తునిగా మారడమే కాకుండా, రమణ మహర్షి పై రమణవాణి, రమణస్థాన్ అనే పత్రికలు నిర్వహించారు. విస్తృతంగా పర్యటిస్తూ రమణ మహర్షి గురించి ప్రవచనాలు చెప్పేవారు. రమణ మహర్షి భక్తునిగా, రమణ తత్త్వ ప్రచారకునిగా ఉంటూనే, కమ్యూనిస్టు పార్టీని ఎన్నడూ ద్వేషించలేదనీ త్రిపురనేని గోపిచంద్ శిష్యుడిగా ఉంటూ, సాహిత్య రంగంలో చురుగ్గా ఉండేవారని ఆయన కుమారుడు, ప్రముఖ పాత్రికేయులు మెరుగుమాల నాంచారయ్య చెప్పారు. తెలుగునాట ఎక్కువగా బ్రాహ్మణులు, ఇతర కులాల్లోని కాస్త స్థిరపడ్డ కుటుంబాల్లో ఈ రమణ మహర్షి గురించి తెలిసిన వారు బాగా కనిపిస్తారు. తెలుగునాట ఆధ్యాత్మిక ప్రపంచంలో రమణ మహర్షి గురించి తెలియడానికి కారకుల్లో కావ్యకంఠ వసిష్ఠ గణపతిమునిగా ప్రాచుర్యం పొందిన అయ్యల సోమయాజుల గణపతి శాస్త్రి కూడా ఒకరు. గణపతిముని, రమణమహర్షి బోధనలతో రమణ గీత అని ఒక గ్రంథం కూడా రాశారు. ఆయన్ను గురువుగా అంగీకరించారు. గణపతిముని విజయనగరం దగ్గరలో కలవరాయి అగ్రహారంలో జన్మించిన సంస్కృత పండితులు, ఆధ్యాత్మిక వేత్త. రమణ మహర్షిని ఆయన ఆధ్యాత్మిక ప్రస్థాన తొలినాళ్లలో స్వయంగా కలిసిన తక్కువ మంది తెలుగువారిలో ఆయనొకరు. ఆయన బోధనలను గ్రంథస్తం చేశారు. రమణ మహర్షికి భగవాన్ రమణ మహర్షి అనే పేరు పెట్టింది కూడా ఈయనే అని కొందరు భక్తులు చెబుతారు. ఎవరీ రమణ మహర్షి?, వెంకట్రామన్ అయ్యర్ గా 1879 లో తిరుచుళిలో పుట్టిన ఈయన సన్యాసాశ్రమ పేరు రమణ మహర్షి. భక్తులు భగవాన్ అని, రమణులు అని రకరకాల పేర్లతో పిలుస్తారు. 1896 లో ఆయన అరుణాచలం చేరుకుని అక్కడే ఉండిపోయారు. 1922 నుంచి 1950 లో ఆయన సమాధి అయ్యే వరకూ రమణాశ్రమంలో ఉన్నారు. భారత్ తో పాటు, భారతీయ ఆధ్యాత్మికత పై ఆసక్తి ఉన్న విదేశీయులు పెద్ద ఎత్తున ఈయన్ను దర్శించుకునే వారు. ఆయన సమాధి ఈ ఆశ్రమం లోనే ఉంది. "నేను" అనే దాని గురించి తెలుసుకోవడం, "మౌనం" ప్రాధాన్యం వంటివి ఆయన బోధనల్లో ప్రముఖమైనవి. ఆయన స్వయంగా తెలుగు మాట్లాడడంతో పాటు, తెలుగులో రాసేవారు. తెలుగు భక్తుల కోసం ఆయన చేతి రాత ప్రతులను స్కాన్ చేసి పుస్తకాలు ఇస్తారు ఆశ్రమం వారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఆంధ్ర, తమిళనాడు కలసి ఉన్నప్పటి నుంచే ఆయనకు ఇక్కడ భక్తులు ఉండేవారు.




# ఇది డల్లాసా?, లేక పాకిస్తానా?







**అమెరికా: పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు బ్రాండన్ గిల్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. టెక్సాస్ లో ఇస్లామీకరణ శరవేగంగా జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాము డల్లాస్ లో నివసిస్తోన్నట్టు లేదని, పాకిస్తాన్ లో ఉన్నట్టు ఉందని తేల్చి చెప్పారు. టెక్సాస్ ప్రత్యేకించి డల్లాస్ లో ఈ తరహా వాతావరణం ఉందని అన్నారు. మసీదులు, కొన్ని షాపింగ్ మాల్స్ లను చూస్తోంటే పాకిస్తాన్‌లో ఉన్నామనే కలుగుతోందని, అక్కడి వాతావరణం, స్థితిగతులు ఇక్కడ కనిపిస్తోన్నాయని విమర్శించారు. యూరప్ చేసిన తప్పుల నుండి అమెరికా గుణపాఠం నేర్చుకోవాలని బ్రాండన్ గిల్ హెచ్చరించారు. ఈ మేరకు ఓ వీడియోను సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ పై పోస్ట్ చేశారు. యూఎస్ కాంగ్రెస్ లో టెక్సస్ 26 వ డిస్ట్రిక్ట్ కు ఆయన ప్రాతినిధ్యాన్ని వహిస్తోన్నారు. అమెరికాలో అధికారంలో ఉన్న రిపబ్లికన్ పార్టీ సభ్యుడు. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు అత్యంత నమ్మకస్తుడిగా పేరుంది. ఇస్లామిక్ వలసలు అమెరికాను నాశనం చేస్తున్నాయని తేల్చి చెప్పారు. రియల్ అమెరికాస్ వాయిస్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గిల్ మాట్లాడారు. స్థానిక అమెరికన్ ఓటర్ల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులను ఉటంకించారు. డల్లాస్ ప్రాంతంలో ఇస్లామీకరణ శరవేగంగా జరుగుతోందని ఓటర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, దీని పై నిరంతరం ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయని స్పష్టం చేశారు. షాపింగ్ మాల్స్‌లో గమనిస్తున్న మార్పులను ఓటర్లు తన దృష్టికి తీసుకొచ్చారని, అక్కడి పరిస్థితుల గురించి వివరించారు. మన కమ్యూనిటీలు, మన సంస్కృతి, మనం ఇష్టపడే ఈ డల్లాస్ ప్రాథమిక మూలాల నుంచి క్రమేణా రూపాంతరం చెందుతోందని, దీనికి కారణం ఇస్లామీకరణ, వలసలే కారణమని స్పష్టం చేశారు. గిల్ వ్యాఖ్యలు టెక్సాస్ లోని ముస్లిం కమ్యూనిటీ సభ్యులతో సహా అనేకమందిలో ఆగ్రహం రేపాయి. ఈ వ్యాఖ్యల పట్ల పలువురు ప్రముఖులు స్పందించారు. విభజనను ప్రోత్సహించేలా ఉన్నాయని మండి పడ్డారు. అమెరికన్ ముస్లింలను అకారణంగా లక్ష్యంగా చేసుకుంటున్నాయని విమర్శించారు. ఇస్లామోఫోబిక్ ఫాసిస్ట్ గా అభివర్ణిస్తోన్నారు.



# ప్రజల గుండెల్లో ఈడ్పుగంటి సుందరయ్య చిరస్మరణీయులు.





- వారితో 3 దశాబ్దాల పైగా నాకు అనుబంధం ఉంది.
- బలివే బ్రిడ్జికి సుందరయ్య వారధిగా నామకరణం చేస్తాం.
- ఆయన పేరు చిరస్థాయిగా నిలుపుతాం చింతమనేని

**దెందులూరు, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** సుందరయ్య విగ్రహం ఆవిష్కరించడం సుందరయ్య ఘాట్ ను ప్రారంభించడం ఎంతో గర్వకారణంగా ఉంది దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి. పెదవేగి మండలం నడిపల్లి పంచాయతీ పరిధిలో బలివే బ్రిడ్జి వద్ద టిడిపి సీనియర్ నాయకులు, స్వర్గీయ ఈడుపుగంటి నాగభూషణం ( సుందరయ్య) విగ్రహాన్ని ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనీ నివాళులు అర్పించిన కూటమి నాయకులు, సుందరయ్య కుటుంబ సభ్యులు. పెదవేగి మండలం విజయరాయి గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ ఈడుపుగంటి సుందరయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఉదయం నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధి లోని బలివే బ్రిడ్జి వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సుందరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలవేసి జోహార్ ఈడుపుగంటి సుందరయ్య అంటూ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరయ్య తో తమకున్న జ్ఞాపకాలను నాయకులు, కుటుంబ సభ్యులు మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకు లైన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఈడుపుగంటి నాగభూషణం కి సుందరయ్య అనే పేరు నామకరణం చేశారని, అదే స్ఫూర్తితో ఈడుపుగంటి సుందరయ్య కూడా ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయేలా జీవించారని అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులుగా, విజయరాయి గ్రామ ఉపసర్పంచ్ గా, విజయరాయి సొసైటీ చైర్మన్ గా ఆయన నిర్వహించిన ప్రతి బాధ్యతలను నీతి నిబద్ధతతో పనిచేసి ఆ పదవులకు సైతం మరింత గౌరవం తెచ్చిన వ్యక్తి ఈడ్పుగంటి సుందరయ్య అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. సుందరయ్య తో తనకు మూడు దశాబ్దాల పైగా ఎంతో అనుబంధం ఉందని, రాజకీయంగా పార్టీ పరంగానే కాకుండా తనతో ఎంతో వ్యక్తిగత సాన్నిహిత్యం కలిగిన వ్యక్తి సుందరయ్య ని అటువంటి మహనీయుని విగ్రహాన్ని, ఆయన పేరుతో నిర్మించిన సుందరయ్య ఘాటు ను ఆవిష్కరించే సదవకాశం తనకు దక్కడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నానని, ప్రజలందరి కోరిక మేరకు త్వరలోనే బలివే బ్రిడ్జి కు సుందరయ్య వారిదిగా నామకరణం చేసే విధంగా చర్యలు చేపడతామని చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య సతీమణి ఈడుపుగంటి లక్ష్మీ సుందరయ్య, ఆయన కుమారుడు టిడిపి నాయకులు ఈడుపుగంటి గిరిబాబు, దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గారపాటి రామసీత, బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, విజయరాయి సొసైటీ చైర్మన్ బొప్పన సుధా, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రాంప్రసాద్, పెదవేగి సొసైటీ చైర్మన్ తాత సత్యనారాయణ, మండల పార్టీల అధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్, నంబూరు నాగరాజు, మరడాని రవి, పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైసిపి పార్టీ అనుబంధ విభాగాల నిర్మాణ సమీక్షలో అదీప్ రాజ్







**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** పరవాడ గ్రామంలో గ్రామ పార్టీ, అనుబంధ విభాగాల నిర్మాణ సమీక్ష నిర్వహించిన సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన పెందుర్తి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్, నియోజకవర్గ పరిశీలికులు దంతులూరి దిలీప్ కుమార్. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, పరవాడ మండల ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ, జడ్పీటీసీ పయిల సన్యాసిరాజు, మండల వైస్ ఎంపీపీ లు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి పయిల రాధ కృష్ణ, మండల కార్యదర్శి బత్తి అప్పారావు, వై.సి.పి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# పల్లెలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలన్న గాంధీ మాట నిజం చేస్తున్నాం.

అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నాం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.







**రావులపాలెం, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** మండలంలో రూ.3.60 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. రూ.2.16 కోట్లతో చేపట్టిన ఆరు వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు, గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అన్న జాతిపిత మహాత్మా గాంధీ మాటలను నిజం చేస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలంలో వివిధ గ్రామాల్లో రూ.3.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన నిర్వహించారు. దేవరపల్లిలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. వెదిరేశ్వరంలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రావులపాడులో జాతీయ రహదారి నుంచి ఆర్ & బి రోడ్డు వరకు (అరటి పళ్ల మార్కెట్ రోడ్డు) ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. కొమరాజులంక బ్రిడ్జి నుంచి కొత్తపేట - మందపల్లి ఏటిగట్టు వరకూ ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలతో మెటల్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. రావులపాలెంలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈతకోటలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 30 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఈతకోట గ్రామంలో రూ.1.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డులు, డ్రెయిన్లు ప్రారంభించారు. పొడగట్లపల్లిలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 30 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గోపాలపురంలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో సిసి రోడ్డులు & డ్రెయిన్లు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే మండలం లోని ఈతకోట,గోపాలపురం - 2,కొమరాజులంక, ముమ్మిడివరప్పాడు, రావులపాలెం గ్రామాల్లో రూ.2.16కోట్లతో (ఒక్కొకటి 36లక్షలు) నిర్మించనున్న 6 వెల్నెస్ సెంటర్లకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, అభివృద్ధి కార్యక్రమాల పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో వచ్చే మూడేళ్లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ఓ వాటర్ ప్లాంట్లును ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే





- ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యత.
- జిల్లాలో అవసరమైనన్ని వాటర్ ప్లాంట్లు మంజూరు చేయడానికి సిద్ధం.

**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** కశింకోట మండలం సోమవారం, పరవాడపాలెం గ్రామలలో 2025 - 26 సంవత్సరాల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్, అనకాపల్లి శాసనసభ్యులు కొణతల రామకృష్ణ, కూటమి నాయకులు తో కలసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి వాటర్ ప్లాంట్ లను ప్రారంభించి, మహిళలకు స్వయంగా శుద్ధ మైన తాగునీటిని అందించారు. అనంతరం సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సతీమణి శ్రీ దేవి కి సోమవారం గ్రామ ప్రజలు భారీ ఎత్తున ఘన స్వాగతం పలికారని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ నాటి నుండి నేటి వరకు అదే ప్రేమను చూపిస్తున్న సోమవారం గ్రామ ప్రజలకు ముందుగా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా గొంతెన శ్రీనివాస్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా కొనియాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ఆయన చూపుతున్న అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్యమే ప్రథమ లక్ష్యం గా ప్రతి గ్రామంలో వాటర్ ప్లాంట్ కు ప్రాధాన్యత ఇస్తూ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నాటినుంచి చెబుతున్నట్లుగా అన్నిటికంటే ముఖ్యమైనది ఆరోగ్యం అని ఆరోగ్యానికి శుద్ధ మైన తాగునీరు కీలకమని తెలిపారు. అందుకే ఎవరికీ ఏ అవసరం ఉన్నా సరే ప్రతి గ్రామంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ మంజూరుకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. రెండేళ్లలో రైల్వే అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన తరువాత తనకు స్టాండింగ్ కమిటీ హోదా లభించడం గర్వకారణమని ఆ హోదాకు అనుగుణంగా జిల్లాలో ఉన్న అన్ని రైల్వే నిర్మాణ పనులను రానున్న రెండేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధి కొరకే పని చేస్తోందని అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా పరుగులు పెడుతున్నాయని అన్నారు. గ్రామ అభివృద్ధికి రూ.30 లక్షల నిధుల మంజూరుకు హామీ. గ్రామస్తులు, గొంతెన శ్రీనివాస్ అభ్యర్థన మేరకు గ్రామ అభివృద్ధి కోసం కళ్యాణ మండపం సహా ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు రూ.30 లక్షల వరకు శ్రీ వాణి ట్రస్ట్, సి ఎస్ ఆర్ నిధులు లేకపోతే సొంత నిధులు అయిన సరే పూర్తి స్థాయిలో మంజూరు చేసేందుకు అన్ని విధాలుగా చొరవ చూపిస్తామని ఈ సందర్భంగా ఎం.పీ హామీ ఇచ్చారు. అనకాపల్లి రాష్ట్రం లోనే ముందుండే జిల్లా అవుతుంది. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొనతల రామకృష్ణ జిల్లా అభివృద్ధిని ధ్యేయంగా చేసుకుని పనిచేస్తున్న నాయకుడు సీఎం రమేష్ అని ప్రశంసించారు. రానున్న రోజుల్లో రాష్ట్రం లోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాగా అనకాపల్లి నిలుస్తుందని, అందుకు ఎంపీ సీఎం రమేష్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో కూటమి ప్రభుత్వానికి ఏకపక్ష మద్దతు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పిలా గోవింద సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ద్వారపూడి పరమేశ్వర రావు, కోట్ని బాలాజీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ నాయకులు పొన్నగంటి అప్పారావు, ఈర్ల శ్రీరామ మూర్తి, సోమవారం గ్రామ సర్పంచ్ గొంతెన నాగరత్నం, కూటమి నాయకులు, భారీ ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# జగన్ రెడ్డి బిహేవియర్ హిందూ ద్రోహానికి నిదర్శనం




- ✸ లడ్డూ కల్తీ నుంచి, ఆలయాల పై దాడుల వరకూ వైసీపీ హయాంలో అన్నీ అపవిత్రమే.
- ✸ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** కేంద్ర బడ్జెట్2026 పై నిర్వహించిన మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన ప్రమాణాలు, స్థిరమైన ఉపాధి అవకాశాలు, దేశానికి దీర్ఘకాలిక ఆదాయ వనరులు సృష్టించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్2026 దేశ భవితకు బంగారు బాట వేసిందని అన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు రూ.12 లక్షల కోట్లకు పైగా కేటాయింపులు పెరగడం దేశ అభివృద్ధి పై కేంద్రానికి ఉన్న స్పష్టమైన దూరదృష్టిని చాటుతుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అవసరమని, అదే ఉద్యోగాల సృష్టికి, ఆర్థిక వృద్ధికి పునాదిగా మారుతుందని తెలిపారు. రేపటి తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ బడ్జెట్ రూపొందించ బడిందన్నారు.

ఈ చారిత్రక బడ్జెట్‌కు మార్గనిర్దేశం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి, కేంద్ర ప్రభుత్వానికి మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీఎం, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో దేశ అభివృద్ధికి తోడ్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని అభినందించారు. లడ్డూ కల్తీ హిందూ సమాజం పై ఘోరమైన ద్రోహం అన్నారు. తిరుమల, తిరుపతి దేవస్థానంలో కోట్లాది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన లడ్డూ ప్రసాద తయారీలో కల్తీ నెయ్యి, సింథటిక్ ఘీ, రసాయనాలు వాడటం హిందూ సమాజం పై జరిగిన ఘోర మైన ద్రోహమని పల్లా శ్రీనివాసరావు తీవ్రంగా మండి పడ్డారు. కలియుగ దైవంగా కోట్లాది భక్తులు నమ్మే వేంకటేశ్వర స్వామి ప్రసాదానికే అవినీతి మచ్చ తేవడం వైసీపీ పాలనలో జరిగిన అత్యంత నీచమైన చర్య అని ధ్వజమెత్తారు.

ఎన్‌డీడీబీ నివేదికలు, ఇతర ల్యాబ్ రిపోర్టులను పరిశీలిస్తే లడ్డూ తయారీలో కల్తీ జరిగిన విషయం ఎలాంటి సందేహానికి తావు లేకుండా స్పష్టంగా తేలుతోందని తెలిపారు. అధికారిక నివేదికలు కల్తీని నిర్ధారిస్తుంటే, మాజీ ముఖ్యమంత్రి ఒకవైపు కల్తీ లేదని చెబుతుండడం, అదే సమయంలో మాజీ టీటీడీ చైర్మన్ మాత్రం కల్తీ జరిగింది అని ఒప్పుకోవడం వైసీపీ లోపలి విరుద్ధతలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని తాకట్టు పెట్టారు.విచారణల్లో వెలుగు లోకి వచ్చిన వివరాల ప్రకారం సుమారు 20 కోట్ల లడ్డూలు, దాదాపు 68 లక్షల కిలోల మేర నెయ్యిగా పిలవబడే పదార్థాన్ని ఉపయోగించినట్టు తేలిందన్నారు. పాలతో తయారైన స్వచ్ఛమైన నెయ్యి కాకుండా, పామ్ ఆయిల్, రసాయనాలు, ఇతర మూలకాలతో తయారైన సింథటిక్ ఘీ వాడినట్టు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు.

లాభాల కోసం భక్తుల విశ్వాసాన్ని తాకట్టు పెట్టారని తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం ఆర్థిక అక్రమం మాత్రమే కాదని, హిందువుల మనోభావాల పై ప్రత్యక్ష దాడి అని అన్నారు. రోజుకు 70 వేల నుంచి 80 వేల మంది భక్తులు దర్శించుకునే తిరుమలలో, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం చరిత్రలో మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. ఈ దుర్మార్గానికి బాధ్యులైన వారెవరివైనా సరే కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

ఆలయాల పై దాడులు వైసీపీ నిర్లక్ష్యం. వైసీపీ హయాంలో కేవలం లడ్డూ వ్యవహారమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా 200 కు పైగా దేవాలయాల పై దాడులు జరిగినా నామమాత్ర కేసులు పెట్టి చేతులు దులిపేసుకున్నారని ఆరోపించారు.

ఆలయాల పై దాడులు, హిందువుల పై దాడులు జరిగినా ప్రభుత్వ నిర్లక్ష్యంతో దోషులు శిక్ష తప్పించుకున్నారని అన్నారు. జగన్ రెడ్డి వ్యక్తిగతంగా నాస్తికుడైనా, అధికారంలో ఉన్నప్పుడు హిందూ విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యతను విస్మరించారని విమర్శించారు. తన హయాంలో హింసను ప్రోత్సహించి, ప్రజల పై దాడులు జరిపించి, ఇప్పుడు విక్టిమ్ కార్డ్ ప్లే చేస్తూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో కల్తీ మద్యం, కల్తీ నిర్మాణాలు, కల్తీ పాలన, చివరికి దేవుడి ప్రసాదానికీ కల్తీ చేసిన పాలన వైసీపీ దని ఘాటుగా వ్యాఖ్యానించారు. హిందూ ధర్మం పై అవమానం కొనసాగింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒకప్పుడు ఏడు కొండలు కాదు రెండు కొండలు అంటూ కలియుగ దైవాన్ని అవమానించిన ఘటనను గుర్తు చేస్తూ, అదే ధోరణి జగన్ రెడ్డి పాలనలో కొనసాగిందన్నారు. హిందూ ధర్మం పై నమ్మకం లేని నాయకత్వం అధికారంలో ఉంటే వ్యవస్థలు ఎలా దిగజారుతాయో తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారమే ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఈ వ్యవహారాన్ని బయటపెట్టి, నిజాలను ప్రజల ముందుంచిందని తెలిపారు. లడ్డూ తయారీలో పామ్ ఆయిల్ వాడటం, రసాయనాలు కలవడం, వాటి మూలాల ద్వారా జంతు కొవ్వు కూడా చేరినట్టు నివేదికలు చెబుతున్నాయని అన్నారు. తిరుపతి లడ్డూ స్వచ్ఛతను కాపాడాల్సిన బాధ్యత అందరిదని, ముఖ్యంగా పాలకులదని స్పష్టం చేశారు. ఈ కల్తీ వ్యవహారం పై అసెంబ్లీలో కూడా విస్తృతంగా చర్చించ బోతున్నామని, హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. దేవుడి విషయంలో చేసిన పాపానికి ఎవ్వరూ తప్పించు కోలేరని, న్యాయం తప్పక జరుగుతుందని అన్నారు.

# కేంద్ర బడ్జెట్ పై వివరణ ఇచ్చిన పెమ్మసాని







**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మద్దిలపాలెం లోని ఎంఆర్సి కాకతీయ కన్వెన్షన్ లో కేంద్ర బడ్జెట్ 2026 పై నిర్వహించిన మీడియా సమావేశం వివరాలు తెలిపారు. పార్లమెంటులో బడ్జెట్ ప్రసంగాలు ఆంగ్లంలో ఉండటం, సమయ పరిమితి వల్ల రాష్ట్రాల అంశాల పై చర్చ తక్కువగా ఉంటుంది కాబట్టి, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా వివరించడమే ఈ సమావేశం యొక్క ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. 2004-2014 మధ్య మౌలిక సదుపాయాల కొరత, దార్శనికత లేని స్థితి నుండి, గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం స్పష్టమైన దిశలో పయనిస్తోంది. గత బడ్జెట్‌కు, ఈ బడ్జెట్‌కు మధ్య కేంద్ర ప్రభుత్వం 365 సంస్కరణలను అమలు చేసింది, ఇవి వ్యాపారస్తులకు, సామాన్యులకు ఎంతో మేలు చేస్తున్నాయి. జివిఎస్టీ ని సరళీకరించడం ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగడమే కాకుండా, చిన్న కార్ల ధరలు సుమారు 80,000 వరకు తగ్గాయి. అలాగే హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, విద్య పై జీఎస్టీ ని సున్నాకు తగ్గించారు. కొనుగోలు శక్తిని పెంచి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పన్ను మినహాయింపు పరిమితిని 12 లక్షలకు పెంచారన్నారు. 2018-19లో 5-6% గా ఉన్న నిరుద్యోగ రేటు ప్రస్తుతం 3%కి తగ్గిపోయింది. రక్షణ బడ్జెట్ ను గత ఏడాది కంటే 21% పెంచి, 1.8 లక్షల కోట్ల నుండి 2.2 లక్షల కోట్లకు చేర్చారు. స్వదేశీ తయారీ: రక్షణ బడ్జెట్‌లో 75% నిధులను స్వదేశీ పరికరాల కొనుగోలుకే వాడాలనే నిబంధన వల్ల దేశీయంగా ఉద్యోగ అవకాశాలు, ఆవిష్కరణలు పెరుగుతాయి. ఒకప్పుడు 600 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు నేడు 25,000 కోట్లకు చేరుకున్నాయి.

మౌలిక సదుపాయాలు, రహదారులు, హైవేల బడ్జెట్ ను గత ఏడాదితో పోలిస్తే 10% పెంచారు. రైల్వే బడ్జెట్‌లో 10% పెరుగుదల ఉంది. ఏడు హై-స్పీడ్ రైల్వే కారిడార్లను నిర్మిస్తున్నారు, వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా లబ్ధి చేకూరనుంది.

గ్రామీణాభివృద్ధి (వీబిజి రామ్ జీ పథకం) గ్రామీణాభివృద్ధి బడ్జెట్‌ను 10% పెంచారు. గతంలో ఉన్న ఉపాధి హామీ పథకం స్థానంలో రామ్ జీ పథకాన్ని ప్రవేశపెట్టి, నిధులను 85,000 కోట్ల నుండి 95,000 కోట్లకు పెంచారు. పని దినాలను 125 రోజులకు పెంచారన్నారు. అవినీతిని తగ్గించేందుకు 40% రాష్ట్ర వాటా నిబంధనను తీసుకువచ్చారు.

ఆరోగ్యం & విద్య:

ఈ ఏడాది ఆరోగ్యం, విద్యా రంగాలకు బడ్జెట్ కేటాయింపులను 10% పెంచారు. రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం (ఎస్ఏఎస్సిఐ) రాష్ట్రాల మూలధన పెట్టుబడుల కోసం కేటాయింపులను 23% పెంచి 1.85 లక్షల కోట్లకు చేర్చారు. గతంలో నిలిచిపోయిన 92 కేంద్ర పథకాల్లో 72 పథకాలను ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పునరుద్ధరించడం జరిగింది. వాతావరణ కాలుష్యం తగ్గుతున్నప్పటికీ, ప్రస్తుతం ఆటో ఇమ్యూన్ డిసీజెస్, ఆర్థరైటిస్ వంటి కొత్త రకమైన వ్యాధులు వస్తున్నాయి. వీటికి అవసరమైన మందులు విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కాబట్టి, మన దేశం లోనే తక్కువ ఖర్చుతో వీటిని ఉత్పత్తి చేయడానికి వచ్చే ఐదేళ్లలో 10,000 కోట్లు కేటాయించారు. ఎయిమ్స్ తరహాలో ఆయుర్వేద వైద్యం కోసం మూడు ప్రత్యేక ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నారు. సెమీకండక్టర్లు, డ్రైవర్ లేని కార్ల టెక్నాలజీ పై ప్రత్యేక దృష్టి సారించారు. మొబైల్ ఫోన్ల ఎగుమతిలో భారత్ రెండో స్థానంలో ఉంది. అయితే, ఇప్పటివరకు విడిభాగాలను విదేశాల నుండి తెచ్చి ఇక్కడ అసెంబ్లింగ్ చేస్తున్నాము. ఇక పై ఆ విడిభాగాలను కూడా ఇక్కడే తయారు చేసేందుకు 40,000 కోట్లు కేటాయించారన్నారు. చిప్స్ తయారీకి అవసరమైన 'రేర్ ఎర్త్ మినరల్స్ కోసం మైనింగ్ పనులను ప్రోత్సహిస్తున్నారు. టెక్స్‌టైల్ రంగం: ఒకప్పుడు ప్రపంచ జీడీపీలో 25% భారత్ నుండే ఉండేది. పాత వైభవాన్ని తెచ్చేందుకు 200 కు పైగా టెక్స్‌టైల్ రంగానికి సంబంధించిన పరిశ్రమలను మళ్లీ అభివృద్ధి చేయనున్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి 10,000 కోట్లు కేటాయించారు. రోడ్ల తరహాలోనే నీటి ద్వారా రవాణా ఖర్చును తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మత్స్య సంపద: మత్స్యకారుల కోసం ప్రత్యేక అసోసియేషన్లను ఏర్పాటు చేసి సహకారం అందిస్తారు. పశువుల సంరక్షణ కోసం వెటర్నరీ ప్రొఫెషనల్స్ సంఖ్యను పెంచుతారు. కొబ్బరి, కోకో, జీడిపప్పు వంటి విలువైన పంటలను పండించే రైతులకు దళారీల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి జిల్లాలో మహిళల కోసం ప్రత్యేక హాస్టల్స్ ఏర్పాటు చేస్తారు.

స్వయం సహాయక సంఘాల మహిళల కోసం 'షీ మార్ట్స్ పేరిట తక్కువ అద్దెతో దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు.

ఖేలో ఇండియా ద్వారా క్రీడలకు బడ్జెట్ పెంచారు. కొత్త టూరిస్ట్ స్పాట్లను అభివృద్ధి చేసి, గైడ్‌లకు శిక్షణ ఇచ్చి అప్‌గ్రేడ్ చేస్తారు. క్యాన్సర్, అరుదైన వ్యాధులకు సంబంధించిన మందుల పై ఇంపోర్ట్ డ్యూటీ ని పూర్తిగా తొలగించారు.

రాజధాని అమరావతి అభివృద్ధి కోసం 1,400 కోట్లు కేటాయించారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: కోర్ ఏరియా, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం 400 కోట్లు కేటాయించ బడ్డాయి. పోలవరం ప్రాజెక్ట్: పోలవరం పనుల కోసం 3,300 కోట్లు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల కోసం 10,000 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా హైదరాబాద్-అమరావతి-చెన్నైలను కలిపే హై-స్పీడ్ రైల్వే కారిడార్ కూడా ఉంది. డేటా సెంటర్‌లకు 2047 వరకు 'టాక్స్ హాలిడే' (పన్ను మినహాయింపు) ప్రకటించారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌లో 5 నుండి 6 డేటా సెంటర్లు వచ్చే అవకాశం ఉంది.

విశాఖపట్నంలో క్వాంటం వ్యాలీ వంటి అత్యాధునిక సాంకేతిక కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించారు. రాష్ట్రాలు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి మున్సిపల్ బాండ్లను జారీ చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఒక మున్సిపాలిటీ 1,000 కోట్లు బాండ్ల ద్వారా సేకరిస్తే, కేంద్ర ప్రభుత్వం అదనంగా 100 కోట్ల ఇన్సెంటివ్ ఇస్తుంది. దేశంలో కొబ్బరి ఉత్పత్తిలో 8%, కోకో ఉత్పత్తిలో 40% వాటా ఆంధ్రప్రదేశ్‌దే. ఈ పంటలకు ప్రభుత్వం నుండి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందుతాయి. అరకు వ్యాలీ, పులికాట్ సరస్సు వంటి పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయనున్నారు. గతంలో రోజుకు 12 కిలో మీటర్ల మేర హైవేల నిర్మాణం జరిగేది, ప్రస్తుతం అది 40 కిలో మీటర్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్ 24 గంటల్లో రోడ్డు వేసి గిన్నిస్ రికార్డు సృష్టించిన విషయాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించారు. పేదరిక నిర్మూలన: గతంలో 29% ఉన్న పేదరికం ప్రస్తుతం 11%కి తగ్గింది. దేశ వ్యాప్తంగా 25 కోట్ల మంది పేదరికం నుండి బయటపడ్డారు. సుమారు 4 కోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చే 'లఖ్ పతి దీదీ' పథకం విజయవంతంగా అమలువుతోంది. దేశ వ్యాప్తంగా 4 కోట్ల ఇళ్లను నిర్మించగా, అందులో 75% ఇళ్లు మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవే. రాష్ట్రాల పనితీరు ఆధారంగా నిధుల కేటాయింపులో మార్పులు చేశారు. జీడీపీలో రాష్ట్ర సహకారం (10%), జనాభా నియంత్రణ పనితీరు (10%) ఆధారంగా రాష్ట్రాలకు ఎక్కువ నిధులు పొందే అవకాశం కల్పించారు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి సర్కార్ నిజమైన డబల్ ఇంజన్ సర్కార్, కేంద్ర ప్రభుత్వంలో వచ్చేటువంటి ప్రతి అవకాశాన్ని ప్రతి రూపాయిని ఉపయోగించుకుంటూ ఆంధ్రప్రదేశ్ ని భారతదేశంలో నంబర్ వన్ గా, భారతదేశాన్ని ప్రపంచంలో నంబర్ వన్ గా చేసే విధంగా మేమందరం కృషి చేస్తామని పెమ్మసాని తెలిపారు.

# సింహాచలం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన జె. వెంకటరావు.

✸ అప్పన్న సేవలో నూతన అధ్యాయం



**సింహాచలం, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా జె. వెంకటరావు ఆదివారం ఉదయం అత్యంత భక్తి శ్రద్ధలతో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇంచార్జ్ ఈఓగా వ్యవహరించిన ఎన్. సుజాత నూతన ఈఓ కి అధికారికంగా బాధ్యతలను అప్పగించారు.

తొలుత తన సతీమణితో కలిసి ఆలయానికి చేరుకున్న వెంకటరావు కి దేవస్థానం అర్చకులు, అధికారులు నాదస్వర, వేద మంత్రాల నడుమ సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు ధ్వజస్తంభానికి మొక్కుకుని, గర్భాలయం లోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శింపజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 92 జంటలతో వైభవంగా స్వాతి హోమం ఆదివారం స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో నిర్వహించిన స్వాతి హోమంలో నూతన ఈఓ దంపతులు పాల్గొన్నారు. లోక కల్యాణార్థం, క్షేత్రాభివృద్ధి కోసం జరిగిన ఈ హోమంలో 92 మంది భక్త జంటలు పాల్గొని స్వామివారికి ఆహుతులు సమర్పించారు. హోమ గుండం నుండి వెలువడిన ఆధ్యాత్మిక ప్రకంపనల మధ్య, వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. హోమానంతరం పండితులు ఈఓ దంపతులకు ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాన్ని బహూకరించారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస వాస్తవ్యులైన జె. వెంకట రావు 1995 నుండి రెవెన్యూ రంగంలో విశేష సేవలు అందించారు. తహశీల్దార్ నుండి డిప్యూటీ కలెక్టర్ వరకు, అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ లోనూ కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన, క్రమశిక్షణ కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా తనదైన ముద్ర వేసిన ఆయన, ఇప్పుడు సింహాద్రి నాథుని సేవకుడిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింహాద్రి అప్పన్న పాదాల చెంత సేవ చేసే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం అన్నారు. స్వామివారి అనుగ్రహంతో, భక్తులందరికీ త్వరితగతిన దర్శనం కలిగేలా, వసతి, ప్రసాద వితరణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటాం అన్నారు. దేవస్థాన పవిత్రతను కాపాడుతూ, పారదర్శక మైన పాలనతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొని నూతన ఈఓ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఏడాది లోగా అనకాపల్లి జిల్లాకు గోదావరి నీళ్లు తీసుకువస్తాం.

గ్రామాలను స్వర్ణ-స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08**: సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు పరిగెత్తిస్తున్న ఘనత నారా చంద్రబాబు నాయుడు దే అని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం అనకాపల్లి మండలం కుంచంగి, రొంగలివాని పాలెం, కూండ్రం గ్రామాలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలలో

మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి మండలం లోని కుంచంగి, రొంగలివాని పాలెం, కూండ్రం గ్రామాల లోని మూడు గ్రామాలలో సుమారు 1 కోటి 36 లక్షల రూపాయిలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు, సచివాలయం భావనలును మాజీ ఏమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూండ్రం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టను పూర్తి చేసి అనకాపల్లి జిల్లాలో ప్రతి ఎకరాకు నీరు ఇస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల, కూటమి పార్టీల శ్రేణులు, ప్రజలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య జాతర రాట మహోత్సవం



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి దేవస్థానంలో బాలలయంలో వచ్చేనెల 17, 18 తేదీల్లో జాతర, కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారి ముహూర్తం రాట మహోత్సవం ఘనంగా జరిగింది. రాటకు అనకాపల్లి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బీమరశెట్టి రాంకీ ప్రత్యేక పూజలు చేసి రాటను వేశారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యళ్ళ శ్రీధర్,

ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న బిజెపి నాయకులు




**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08**: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన నూకాంబిక అమ్మవారిని దేవస్థానంలో ఆదివారం బిజెపి రాష్ట్ర కిసాన్ మార్చ్ అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అమ్మవారి చిత్రపటం ప్రసాదం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యళ్ళశ్రీధర్, జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, కిషన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు జరగడం శంకర్రావు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు,

కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, యర్రవరపు సంతోష్ కుమారి, భక్తులు పాల్గొన్నారు.

## ఇంటెర్న్షిప్ నకు విద్యార్థులకు ఆహ్వానం

- కేదాశ్రీ కి ఇంటెర్న్షిప్ ధృవ పత్రం అందజేసిన గ్రీన్ క్లైమేట్ టీం.
- విభిన్న రంగాల్లో విద్యార్థులకు ఇంటెర్న్షిప్
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ




**విశాఖపట్నం, పెన్ సత్తా, ఫిబ్రవరి 08**: ఇంటెర్న్షిప్ నకు విద్యార్థులకు ఆహ్వానం పలుకుతున్నామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానం లోని ఎ హబ్ వద్ద ప్రకృతి రైతులు సంతలో గో ఆధారిత ప్రకృతి రైతులు సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ చేతుల మీదుగా సోషల్ వర్క్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కేదాశ్రీ కి ఇంటెర్న్షిప్ పూర్తి చేసిన సందర్భంగా ధృవ పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. విభిన్న రంగాల్లో విద్యార్థులకు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ఇంటెర్న్షిప్ కు అవకాశం కలిగిస్తుంది అన్నారు. ప్రధానంగా సోషల్ వర్క్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఎన్విరాన్మెంట్, బయోడైవర్సిటి తదితర రంగాలకు చెందిన విద్యార్థులకు ఇంటెర్న్షిప్ నకు తమ సంస్థ ఆహ్వానం పలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు పాల్గొన్నారు.

## కూటమి అభివృద్ధిని చూసి తెలుగుదేశం లోకి 300 కుటుంబాల చేరిక.





- పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన మంత్రి సవిత.

**పెనుకొండ, పెన్ సత్తా, ఫిబ్రవరి 08**: నియోజకవర్గం చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కొండంపల్లి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు క్రిష్టప్ప, వెంకటరాముడు, నరసింహమూర్తి, వెంకటేష్, జాఫర్, అల్లా బకాష్, వెంకటలక్ష్మమ్మలతో పాటు మరో 300 కుటుంబాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీ లోకి చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పార్టీ లోకి చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 18 నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రతి వర్గాన్ని ఆదుకునే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ లోకి చేరిన వారు మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి పరుగులు పెడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మంత్రి సవితమ్మ సారథ్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా అనుకూల పాలనకు నిదర్శనంగానే వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.




## మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా పై అవగాహన



**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** మంత్రి పాలెం జే.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్ కాలనీలో పరవాడ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీఐ ఆర్. మల్లికార్జున రావు మాదకద్రవ్యాల వినియోగం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులను సమావేశపరిచి గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం, నిల్వ, రవాణా, అక్రమ విక్రయాలు పూర్తిగా చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. గంజాయి వాడకం లేదా సరఫరా విషయంలో చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే సంబంధిత వ్యక్తుల పై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చట్టపర మైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికల పై సమాచారం ఉన్న వెంటనే పోలీసు శాఖకు తెలియపరచాలని ప్రజలను కోరారు. అలాగే కాలనీలో ఇళ్లను అద్దెకు ఎవరికీ పడితే వారికి ఇస్తున్నట్లు, అటువంటి అద్దెదారులు కొన్ని అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇల్లు అద్దెకు ఇచ్చే సమయంలో జాగ్రత్త వహించాలని, అద్దెకు తీసుకునే వారి వివరాలను ముందుగా పూర్తిగా తెలుసుకున్న తర్వాతే ఇల్లు ఇవ్వాలని సూచించారు. ఒకవేళ అద్దె దారులు ఏవైనా అక్రమ చర్యలకు పాల్పడితే, దానికి ఇంటి యజమానులు కూడా బాధ్యత వహించాల్సిన పరిస్థితి రావచ్చని అవగాహన కల్పించారు. అలాగే యువత ముఖ్యంగా ఆన్లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడుతున్నట్లు గమనిస్తున్నామని, అది ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర నష్టాలకు దారితీస్తుందని వివరించారు. ఆన్లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచించడంతో పాటు, ఆన్లైన్‌లో సులభంగా లోన్లు ఇస్తామని ఆఫర్లు ఇస్తూ సరైన వివరాలు లేని సంస్థల ద్వారా లోన్లు తీసుకుంటే తరువాత వేధింపులు, బెదిరింపులు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అందువల్ల గుర్తింపు లేని ఆన్లైన్ లోన్ యాప్ లు, సంస్థల విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సీఐ ఆర్. మల్లికార్జున రావు సూచించారు.

## చందనాడ లో ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:**నక్కపల్లి మండలం చందనాడ లో వేంచేసి ఉన్న దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామస్తుల సహాయ సహకారాలతో ఆలయ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, గ్రామ సర్పంచ్ తల్లా భార్గవ్, స్థానిక ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, గ్రామ నాయకులు తల్లా అప్పలస్వామి తదితరులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల స్వీకరించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



# సిపిఎం అప్పలరాజును కలసిన వైసిపి నాయకులు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 08:** సిపిఎం జిల్లా కార్యదర్శి,వర్గ సభ్యులు ఎం. అప్పలరాజును వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు అప్పలరాజుని కలిసి పరామర్శించారు. పీడీ యాక్ట్ లో అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఇటీవల జైలు నుండి విడుదలై వచ్చిన అప్పలరాజును ఆదివారం ఎస్ రాయవరం మండలం పి ధర్మవరంలో ఆయన ఇంటి వద్ద వీరంతా కలిసి పూలమాలతో సత్కరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసం రామకృష్ణ మాట్లాడుతూ నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లో ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూసేకరణ లో ప్రజలు, రైతులు, నిర్వాసితులకు అండగా నిలబడి పోరాటం చేస్తున్న అప్పలరాజును పీడీ యాక్ట్ లో అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దారుణమన్నారు. ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రశ్నిస్తున్నందుకే ఇలాంటి అక్రమ కేసులు బనాయించి బెదిరించాలని చూస్తున్నారని ఇది మంచిది కాదన్నారు. అప్పలరాజు ను కలసిన వారిలో వైసిపి నాయకులు రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, చందనాడ సర్పంచ్ తల్లా భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

పెన్ సత్తా
సోమవారం 9 ఫిబ్రవరి 2026

## కోహ్లీ, గంభీర్ మధ్య ఇంకా విభేదాలు..?

# బీసీసీఐ కార్యదర్శి ఏమన్నారంటే...!

**కోహ్లీ, గంభీర్ మధ్య గొడవలు లేవన్న బీసీసీఐ**

**ఇద్దరి మధ్య స్నేహపూర్వక సంబంధం ఉందన్న సెక్రటరీ దేవజిత్ సైకియా**

**గంభీర్ హెడ్ కోచ్ అయ్యాక మొదలైన ఊహాగానాలకు తెర**

**కలిసి పనిచేసి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచారని గుర్తుచేసిన బోర్డు**

**ప్రస్తుతం వన్డేల్లో అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్న విరాట్ కోహ్లీ**

భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న పుకార్లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టత ఇచ్చారు. వారిద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవని, చాలా స్నేహపూర్వక వాతావరణంలోనే కలిసి పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు.గంభీర్ భారత జట్టుకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కోహ్లీతో అతడి సంబంధాలపై క్రికెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా వీరిద్దరి మధ్య జరిగిన వాగ్వాదాల నేపథ్యంలో, ఇప్పటికీ వారి మధ్య దూరం ఉందని కొన్ని కథనాలు వెలువడ్డాయి.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన దేవజిత్ సైకియా ఈ పుకార్లను కొట్టిపారేశారు. "నేను వారిద్దరినీ ఎప్పుడూ గొడవపడగా చూడలేదు. వారి మధ్య చాలా మంచి స్నేహపూర్వక సంబంధం ఉంది" అని స్పష్టం చేశారు. ఐపీఎల్ ఘటన గురించి ప్రస్తావించగా, ఆ సమయంలో తాను జాతీయ జట్టుతో ఉన్నానని, ఆ మ్యాచ్ చూడలేదని సమాధానమిచ్చారు.గంభీర్ కోచ్‌గా, కోహ్లీ కీలక



ఆటగాడిగా ఉన్నప్పుడే భారత్ 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. ఈ విజయం వారిద్దరి మధ్య వృత్తిపరంగా మంచి సమన్వయం ఉందనడానికి నిదర్శనంగా విశ్లేషకులు భావిస్తున్నారు. గంభీర్ హయాంలోనే కోహ్లీ 2025లో టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం గమనార్హం. ప్రస్తుతం 37 ఏళ్ల కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. గత ఆరు వన్డేల్లో మూడు సెంచరీలు, ఒక అర్ధసెంచరీ (93 పరుగులు) సాధించాడు.

# టీ20 ప్రపంచకప్: అరంగేట్రంలోనే బెథెల్ అర్ధ శతకం.. పీటర్సన్ రికార్డు సమం!

**టీ20 వరల్డ్ కప్‌లో నేపాల్‌పై ఉత్కంఠ పోరులో గెలిచిన ఇంగ్లండ్**

**అరంగేట్ర మ్యాచ్‌లోనే హాఫ్ సెంచరీతో అదరగొట్టిన యువ ఆటగాడు జాకబ్ బెథెల్**

**కెవిన్ పీటర్సన్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో ఇంగ్లండ్ బ్యాటర్‌గా రికార్డు**

**జోస్ బట్లర్ టీ20 ప్రపంచకప్ చరిత్రలో వెయ్యి పరుగులు పూర్తి**

టీ20 ప్రపంచకప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్ శుభారంభం చేసింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం నేపాల్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో అతికష్టం మీద విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ యువ ఆటగాడు జాకబ్ బెథెల్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తన అరంగేట్ర ప్రపంచకప్ మ్యాచ్‌లోనే అర్ధ శతకం బాది, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో మాజీ దిగ్గజం కెవిన్ పీటర్సన్ పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. 2007లో పీటర్సన్ తర్వాత, టీ20 ప్రపంచకప్ అరంగేట్రంలోనే హాఫ్ సెంచరీ చేసిన రెండో ఇంగ్లండ్ ఆటగాడిగా బెథెల్ చరిత్ర సృష్టించాడు.మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ త్వరగా ఔట్ కాగా, జోస్ బట్లర్ (22) వేగంగా ఆడినా ఎక్కువసేపు నిలవలేదు. అయితే ఈ క్రమంలో బట్లర్ టీ20 ప్రపంచకప్ చరిత్రలో వెయ్యి పరుగుల మైలురాయిని అందుకున్నాడు. టామ్ బాంటన్ (2) కూడా విఫలమవడంతో ఇంగ్లండ్ కష్టాల్లో పడింది.ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. నేపాల్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి కేవలం 35 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 55 పరుగులు చేశాడు. బ్రూక్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 71 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. బెథెల్ అద్భుత



ఇన్నింగ్స్ వల్లే ఇంగ్లండ్ పోరాడగలిగే స్కోరు చేయగలిగింది. బెథెల్ అద్భుతంగా ఆడాడని, ముఖ్యంగా స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకున్న విధానం బాగుందని కెప్టెన్ హ్యారీ బ్రూక్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ తమ తదుపరి మ్యాచ్‌ను ఫిబ్రవరి 11న ఇదే వేదికపై వెస్టిండీస్‌తో ఆడనుంది.



మీనాక్షి చౌదరి చీరకు మృదువైన సొబగులు తెస్తుంది

# గ్లోబల్ స్టార్ ఆ రేంజ్ సౌండ్ చెయ్యాల్సిందే!

రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన - ఆర్ఆర్ఆం- మూవీతో రామ్ చరణ్ పాన్ ఇండియా స్టార్‌ల జాబితాలో చేరడం, గ్లోబల్ స్టార్‌గా మారడం తెలిసిందే. ఈ మూవీతో భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న చరణ్ ఆ తరువాత దాన్ని కాపాడుకోవడంలో విఫలం అవుతున్నాడనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. కారణం శంకర్‌తో చేసిన పాన్ ఇండియా మూవీ-గేమ్ ఛేంజర్- బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలవడమే. అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అందులో సగాన్ని కూడా రాబట్టలేక తీవ్ర నిరాశకు గురి చేసింది.-ఆర్ఆర్ఆర్- వంటి పాన్ ఇండియా హిట్ తరువాత అదే స్థాయి హిట్‌ని సొంతం చేసుకోవాలని ప్రయత్నించిన చరణ్‌కు -గేమ్ ఛేంజర్- ఓ నైట్‌మేర్‌లా మారి షాక్ ఇచ్చింది. మూడేళ్ల శ్రమ కూడా వృధాకావడంతో ఇప్పుడు చరణ్ తదుపరి ప్రాజెక్ట్‌ని చాలా తెలివిగా ప్లాన్ చేసుకున్నాడట. అదే -పెద్ది-ఉప్పెన-వంటి బ్లాక్ బస్టర్ మూవీతో తొలి ప్రయత్నంలోనే దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న బుచ్చిబాబు దీనికి దర్శకుడు. క్రికెట్ గేమ్ చుట్టూ సాగే పీరియాడిక్ లవ్‌స్టోరీగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.



రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీతో ఎలాగైనా పాన్ ఇండియా లెవెల్లో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకోవాలని, -పెద్ది- విజయంతో మళ్లీ ట్రాక్‌లోకి రావాలని చరణ్ గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలోని కీలక పాత్రల్లో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, మీర్జాపూర్ నటుడు దివ్యేందు నటిస్తుండగా మరో ముఖ్య పాత్రలో బాలీవుడ్ నటుడు బోమన్ ఇరానీ నటిస్తున్నారు. ఇక అప్పలసూరి పాత్రలో జగపతిబాబు కనిపించబోతున్నారు.రీసెంట్‌గా విడుదల చేసిన ఆయన ఫస్ట్ లుక్ అందరిని షాక్‌కు గురి చేస్తోంది. గుర్తు పట్టలేని విధంగా జగపతిబాబు మేకోవర్ ఉండటంతో అంతా అవాక్కవుతున్నారు. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన పెద్ది గ్లింప్స్, అందులో చెర్రీ బ్యాటింగ్ చేస్తూ తనదైన మేనరిజంతో ఆడిన షాట్, ఫస్ట్ సింగిల్ చికిరిలో రామ్‌చరణ్ వేసిన స్టెప్స్, రెహమాన్ సంగీతం నెట్టింట ట్రెండ్ అయి సినిమాపై అంచనాల్ని పెంచేశాయి.2026 మార్చి 27న పాన్ ఇండియా వైడ్‌గా భారీ స్థాయిలో రిలీజ్ కానున్న ఈ మూవీతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రేంజ్‌కు తగ్గట్టుగా సౌండ్ చేయాల్సిందేనని అంతా అంటున్నారు. కంటెంట్, క్యారెక్టర్ డిజైన్ చేసిన విధానం, రెహమాన్, రత్నవేలు, నవీన్ నూలి వంటి టాప్ నాచ్ టెక్నీషియన్స్‌తో చేస్తున్న %-%పెద్ది%-%తో ఈ సారి చరణ్ గట్టిగా సౌండ్ చేసి పాన్ ఇండియాకు మించి బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకోవాల్సిందేనని అంతా అంటున్నారు. ఫ్యాన్స్ కూడా ఇదే ఫీలవుతూ చరణ్ నుంచి బ్లాక్ బస్టర్ హిట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com